

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com








హైదరాబాద్ | ఆదివారం 11-10-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-2020 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి:27 | సంచిక:60 | పేజీలు:4 | వెల: రూ.1/-


# పంటల కొనుగోళ్లు, యాసంగి సాగుపై సీఎం కేసీఆర్ సమీక్ష

హైదరాబాద్ , అక్టోబర్ 10: వానా కాలంలో పంటల కొనుగోళ్లు, యాసంగిలో సాగు విధానంపై ముఖ్యమంత్రి కేసీఆర్ ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రగతి భవన్‌లో జరుగుతున్న ఈ సమావేశానికి వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్‌తో పాటు సంబంధిత అధికారులు హాజరయ్యారు.

యాసంగిలో ఏ పంట వేయాలి? ఏది వేయొద్దు? ఏ పంట వేస్తే లాభం? దేనితో నష్టం? తదితర అంశాలపై సీఎం సమీక్షించనున్నారు. కేంద్ర ప్రభుత్వం పెద్దఎత్తున మక్కలను దిగుమతి చేసుకుంటున్నదని, దీనివల్ల దేశంలో మక్కల కొనుగోలుపై ప్రభావం పడుతుందని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో మక్కల సాగుపై నిర్ణయం తీసుకోవాల్సి ఉన్నదని, శనివారం నాటి సమావేశంలో ఈ అంశంపైనా విస్తృతంగా చర్చ జరుగుతుందని చెప్పారు. కరోనా ముప్పు ఇంకా తొలుగనందున రైతుల ఆరోగ్యాన్ని కాపాడేందుకు గ్రామాల్లోనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయాలని సీఎం నిర్ణయించిన సంగతి తెలిసిందే. దీనిపైనా సీఎం సమీక్షించనున్నారు. 'కరోనా నేపథ్యంలో యాసంగి పంటలను గ్రామాల్లోనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి సేకరించాం. ఇంకా కరోనా ముప్పు తొలుగలేదు. కాబట్టి వానకాలం పంటలను కూడా గ్రామాల్లోనే కొనుగోలు చేయాలి. ఆరు వేల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు జరుపాలి. ఇందుకు ప్రభుత్వపరంగా అన్ని ఏర్పాట్లుచేయాలి. పంట కొనుగోళ్ల తర్వాత వీలైనంత తక్కువ సమయంలో రైతులకు డబ్బు చెల్లించాలి. దీనికోసం కావాల్సిన ఏర్పాట్లను ముందుగానే చేయాలి' అని సీఎం కేసీఆర్ అధికారులను ఆదేశించారు.

# యూపిలో బస్సు బోల్తా

## ముగ్గురు ప్రయాణికుల మృతి

లక్నో,అక్టోబర్10(ఆర్‌ఎన్‌ఎ): ఢిల్లీ నుంచి కాన్పూరుకు వస్తున్న బస్సు శనివారం బోల్తాపడిన దుర్ఘటనలో ముగ్గురు ప్రయాణికులు మరణించారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని అలీఘఢ్ జిల్లా టప్పాల్ ప్రాంతంలో ఢిల్లీ నుంచి కాన్పూరుకు వస్తున్న ప్రయాణికుల బస్సు శనివారం తెల్లవారజామున ఒక్కసారిగా బోల్తా పడింది. ఈ ప్రమాద ఘటనలో ముగ్గురు ప్రయాణికులు అక్కడికక్కడే మరణించారు. ఈ ఘటనలో మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి సహాయ పనులు చేపట్టారు. బస్సు బోల్తా పడినపుడు అందులో 45 మంది ప్రయాణికులు ఉన్నారు. బస్సు ప్రమాదంపై యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బస్సు బోల్తా పడిన ఘటనలో గాయపడిన వారికి మెరుగైన వైద్య చికిత్స అందించాలని సీఎం యోగి అధికారులను ఆదేశించారు.

# సీఎం కేసీఆర్ ఆస్తులు ఆన్‌లైన్‌లో నమోదు



సిద్దిపేట, అక్టోబర్ 10: ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు కుటుంబం ఆస్తి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు అయ్యాయి. మర్కుక్ మండలంలోని ఎర్రవల్లిలోని తన నివాస గృహానికి వచ్చిన గ్రామ కార్యదర్శి సిద్దేశ్వర్‌కు సాధారణ పౌరుడి మాదిరిగానే సీఎం కేసీఆర్‌కు తన కుటుంబం ఆస్తుల వివరాలను తెలియజేశారు. సీఎం కేసీఆర్ నివాస గృహాల వివరాలను తెలంగాణ వ్యవసాయేతర ఆస్తుల నమోదు యాప్‌లో గ్రామ కార్యదర్శి నమోదు చేశారు.

ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ మాట్లాడుతూ.. గ్రామీణ, పుర ప్రజలు తమ స్థిరాస్తుల వివరాలను నమోదు చేసుకోవాలని సీఎం సూచించారు. ఆస్తులపై ప్రజలకు హక్కు, భద్రత కల్పించేందుకు వివరాలను నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి కుటుంబం స్థిరాస్తుల వివరాలను విధిగా నమోదు చేసుకోవాలన్నారు. ఆస్తుల నమోదు అనేది దేశంలోనే మొట్టమొదటి అతి పెద్ద ప్రయత్నమని చెప్పారు. సాగు భూముల తరహాలోనే వ్యవసాయేతర భూములకు పట్టాదారు పాస్ పుస్తకాలు ఇస్తామన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన స్థిరాస్తుల నమోదు ప్రక్రియ చరిత్రలో మైలురాయిగా నిలుస్తుందని సీఎం కేసీఆర్ అన్నారు.

# భారత్‌లో అందరికీ సమాన హక్కులు

## పాక్‌లో లాగా ఇతర మతాల స్వేచ్ఛను హరించలేదు
## భారత రాజ్యాంగం గొప్పదనం అదే: మోహన్ భగవత్

ముంబై,అక్టోబర్10(ఆర్‌ఎన్‌ఎ): భారత రాజ్యాంగంలో హిందువల ఆధిపత్యాన్ని అంగీకరించాలని ఎక్కడా చెప్పలేదని ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ అన్నారు. ఈ దేశంలో అందరూ మతసహనంతో బతికే అవకాశం ఉందన్నారు. పాక్ ప్రత్యేక దేశంగా ఏర్పడ్డా అక్కడ ఇతర మతాల వారికి స్వేచ్ఛ లేదన్నారు.

ప్రపంచవ్యాప్తంగా పోలిస్తే భారత్‌లోనే ఎక్కువ సంతృప్తికర ముస్లింలు ఉన్నారని మోహన్ భగవత్ అన్నారు. అయితే, స్వలాభం ప్రభావితమయ్యే వ్యక్తుల ద్వారా మూర్ఖత్వం, వేర్పాటువాదం వ్యాప్తి చెందుతున్నదని ఆయన నొక్కి చెప్పారు. భారతదేశం గురించి చెడు ఆలోచన వచ్చినప్పుడల్లా ప్రజలంతా కలిసి నిలబడ్డారని ఆయన గుర్తుచేశారు. మహారాష్ట్రకు చెందిన 'వివేక్' పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భగవత్ అనేక విషయాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. పాకిస్తాన్ ప్రత్యేక దేశంగా సృష్టించినందున ఇతర మతాలకు చెందిన వారికి హక్కులు లేవన్నారు. భారతదేశంలో అన్ని మతాల ప్రజలు ఉన్నారని, పాక్‌లో మాదిరి కాకుండా భారత్‌లో అన్నిమతాల వారికి తమతమ మత విశ్వాసాన్ని పాటించే స్వేచ్ఛ కలిగివున్నారని తెలిపారు. మొఘల్ చక్రవర్తి అక్బర్‌కు వ్యతిరేకంగా పోరాడిన మేవార్ రాజు మహారాణా ప్రతాప్ సైన్యంలో చాలా మంది ముస్లింలు ఉండేవారని, భారతదేశ సంస్కృతిపై దాడి జరిగినప్పుడల్లా అన్ని మతాల ప్రజలు ఒకచోట చేరి ఐకమత్యం ప్రదర్శించారని చెప్పారు. భారత రాజ్యాంగం హిందువులు మాత్రమే ఇక్కడ ఉండాలని చెప్పలేదని, ముస్లింలు ఇక్కడ ఉండాలనుకుంటే హిందువుల ఆధిపత్యాన్ని అంగీకరించాలి అని కూడా రాజ్యాంగంలో పేర్కొనలేదని భగవత్ పేర్కొన్నారు. ముస్లింలు పాకిస్తాన్‌లో నివసించేలా హిందుస్తాన్ విభజించారని, అయితే ఆ సమయంలో ఉన్న పరిస్థితుల ప్రకారం భారత్‌లో హిందువులు పూర్తి ప్రభావాన్ని కలిగి ఉండాలని, కాని ఇతర మతాలను అనుసరించిన ప్రజలకు పాకిస్తాన్‌కు వెళ్లాలని భారత రాజ్యాంగం ఎప్పుడూ చెప్పలేదని ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ అన్నారు. ఏ మతంలోనైనా ప్రతి ఒక్కరినీ ఒకే తాడుపైకి అనుసంధానించడం, ఉద్ధరించడం, ఏకం చేయడమే ప్రధాన పాత్రగా ఉంటుందని తెలిపారు. అయోధ్యలో రామమందిర నిర్మాణంపై భగవత్ మాట్లాడుతూ.. ఈ ఆలయం కర్మ ప్రయోజనాల కోసం కాదని, ఇది భారతదేశ జాతీయ విలువలు, స్వభావానికి చిహ్నంగా ఉంటుందని చెప్పారు. దీనిని మతప్రాతిపదికగా చూడలేమన్నారు. ఇదిలావుంటే మోహన్ భగవత్ శనివారం గుంటూరు జిల్లాలో జరుగుతున్న ఆర్‌ఎస్‌ఎస్ కార్యక్రమంలో పాల్గొన్నారు. మూడురోజుల పాటు ఆయన ఇక్కడే ఉంటారు.

# మహిళలకు బతుకమ్మ కానుకగా చీరల పంపిణీ

## -దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్,అక్టోబర్10(ఆర్‌ఎన్‌ఎ): తెలంగాణ ఆడబిడ్డలు బతుకమ్మ పండుగను ఆనందంగా జరుపుకునేందుకు ప్రభుత్వ కానుకగా సీఎం కేసీఆర్ చీరెలను అందజేస్తున్నారని దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. ప్రలజకు ప్రతి యేడా దసరా ముందు చీరల పంపిణీ జరుగుతోందని అన్నారు. ఆడపడచులకు సిఎం కానుకగా దీనిని అందచేస్తున్నామని అన్నారు. శనివారం నిర్మల్ రూరల్ మండలం ముజిగి గ్రామంలో మహిళలకు ఆయన బతుకమ్మ చీరెలు పంపిణీ చేసి స్థానికంగా మొక్కలు నాటి మాట్లాడారు. కరోనా కష్టకాలంలోనూ ప్రభుత్వం రూ.317 కోట్లతో ఆడపడుచులకు బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్నదని గుర్తుచేశారు. మహిళల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదన్నారు.

కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లోనూ ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా సంక్షేమ పథకాలను ప్రభుత్వం కొనసాగిస్తున్నదని చెప్పారు. అర్హులందరికీ చీరెలను అందజేస్తామని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా బతుకమ్మ పండుగ విశిష్టతను చాటి చెప్పిన ఘనత ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ముజిగి గ్రామంలో రామాలయం నిర్మాణానికి రూ.50 లక్షలు, మల్లన్న ఆలయంలో కోనేరు నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఆయన వెంట కలెక్టర్ ముషారఫ్ ఫారూకీ, ఎంపీపీ రామేశ్వర్ రెడ్డి, జడ్పీ కో- ఆప్షన్ సుభాశ్ రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ నర్మదా ముత్యంరెడ్డి, ఎఫ్‌ఎస్‌సీఎస్ చైర్మన్ ధర్మాజీ రాజేందర్, డీఆర్‌డీఏ వెంకటేశ్వర్లు, సర్పంచ్ రాజమని మల్లేశ్ తదితరులున్నారు.

# ఎల్‌ఓసీ వెంట పరిస్థితి అదుపులో ఉంది : లెఫ్టినెంట్ జనరల్ బీఎస్ రాజు

శ్రీనగర్, అక్టోబర్ 10: ఎల్‌ఓసీ వెంట పరిస్థితి అదుపులో ఉందని, గతేడాదితో పోలిస్తే మెరుగ్గా ఉందని జనరల్ ఆఫీసర్ ఇన్ కమాండ్ ఎక్స్‌వీ కార్ప్స్ లెఫ్టినెంట్ జనరల్ బీఎస్ రాజు అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ కాల్పుల విరమణ ఉల్లంఘన సంఘటనలు చాలా తక్కువగా ఉన్నాయని, భారత సైన్యం సైతం ప్రతీకారం తీర్చుకుంటోందని ఆయన అన్నారు. ఎల్‌ఓసీ పరిస్థితి అదుపులో ఉందని, పాకిస్థాన్ కాల్పుల విరమణ ఉల్లంఘిస్తోందని, అయితే గత కొద్ది రోజులుగా దానిపై కూడా నియంత్రణ సాధించినట్లు చెప్పారు.

సరిహద్దుల్లో చాలా వరకు చొరబాట్లను నియంత్రించడంలో విజయవంతమయ్యామన్నారు. 2019లో చొరబాటు కార్యకలాపాలను పోల్చి చూస్తే 'గత సంవత్సరం 130 మంది చొరబడ్డారని, ఈ ఏడాది 30కంటే తక్కువ' అని చెప్పారు. 'ఇది అంతర్గత పరిస్థితులకు కూడా సహాయపడే భారీ మార్పు' అని తెలిపారు. ఇదిలావుండగా, ఉత్తర కాశ్మీర్‌లోని కేరన్ సెక్టార్‌లో మోహరించిన భారత సైన్యం పాకిస్థాన్ నుంచి ఆయుధాలను అక్రమంగా రవాణా చేసేందుకు పాక్ ఆర్మీ మద్దతు ఉన్న ఉగ్రవాదులు చేసిన ప్రయత్నాన్ని అడ్డుకుంది.

# ప్రధానికేమో బుల్లెట్ ప్రూఫ్ విమానం

## సైనికులకు డొక్కు ట్రక్కులా
## ట్విట్టర్‌లో మండిపడ్డ రాహుల్

న్యూఢిల్లీ,అక్టోబర్10(ఆర్‌ఎన్‌ఎ): మోదీ సర్కార్ వీవీఐపీ హెలికాప్టర్‌ను ఖరీదుకు పెట్టిన ఖర్చు సైనికుల వాహనాలకు కూడా పెట్టడం లేదని కాం÷-గరెస్ ఎంపి రాహుల్ గాంధీ మరోసారి ఫైర్ అయ్యారు. తన ట్విట్టర్‌లో ఓ వీడియో పోస్టు చేసిన రాహుల్.. మన జవాన్లను నాన్ బుల్లెట్ ప్రూఫ్ ట్రక్కుల్లో యుద్దానికి పంపుతున్నారు, కానీ ప్రధాని మోదీ మాత్రం 8400 కోట్లతో ప్రత్యేక బుల్లెట్ ప్రూఫ్ విమానం తెప్పించుకున్నట్లు ఆరోపించారు. ఇది ఎంత వరకు న్యాయం అని ఆయన ప్రశ్నించారు. రెండు నిమిషాలు ఉన్న వీడియోలో.. బుల్లెట్ ప్రూఫ్ వాహనాలు ఉన్నా.. నాన్ బుల్లెట్ ప్రూఫ్ వాహనాల్లో తమను తరలిస్తున్నట్లు జవాన్లు ఆరోపించారు. వరుసగా రెండవ రోజు రాహుల్ ఈ అంశంలో విమర్శలు గుప్పించారు. గురువారం తన ట్వీట్‌లో సియాచిన్-లడాఖ్ సైనికులకు ఎన్ని నిత్యావసరాలు కొనవచ్చో చెప్పారు. రెండు వీవీఐపీ విమానాల కొనుగోలుకు సంబంధించి కేంద్రంపై కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ నిశిత విమర్శలు చేశారు. ట్రక్కుల్లో జవాన్లను పంపుతుండటంతో వారు అమర వీరులు అవుతున్నారని, ప్రధాని మాత్రం రూ.8,400 కోట్ల విమానంలో వెళ్తారని అన్నారు. ఇదేమి న్యాయమంటూ ఓ ట్వీట్‌లో ఆయన నిలదీశారు. వీవీఐపీ విమానాల గురించి రాహుల్ మాట్లాడటం ఇదే మొదటిసారి కాదు. గత వారం కూడా పంజాబ్‌లో జరిగిన ర్యాలీలో ఈ ప్రస్తావన చేశారు. 'ఒకవైపు రూ.8,000 కోట్లు విలువ చేసే రెండు విమానాలను ప్రధాని మోదీ కొనుగోలు చేశారు. మరోవైపు చైనా మన సరిహద్దుల్లో ఉంది. మన భద్రతా బలగాలు గడ్డకట్టించే చలిలో అత్యంత సాహసంతో సరిహద్దుల్లో పహరా కాస్తున్నారు' అని అన్నారు.

# మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు : ఆల వెంకటేశ్వర్‌రెడ్డి



మహబూబ్‌నగర్, అక్టోబర్ 10 : ప్రభుత్వ చేయూతతో మత్స్యకారుల జీవితాల్లో వెలుగుపూలు పూస్తున్నాయని దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. భూత్పూర్ మండలం శేరిపల్లి అనంతమ్మ చెరువులో ప్రభుత్వం వదిలిన చేప పిల్లలు పెరిగి పెద్దయ్యాయి. ఈ చేపలు పట్టే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నేడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉచిత చేప పిల్లలు, ఇతర పనిముట్లు, రుణాలు అందించి మత్స్యకారులకు చేయూతనివ్వడం వల్ల వారి కుటుంబాలు బాగుపడుతున్నాయన్నారు. ఒకే రోజు రూ. 6 లక్షల విలువైన చేపలను మత్స్యకారులు పట్టినట్లు తెలిపారు. ఒకప్పుడు ఆదాయ వనరులు లేక మత్స్యకారులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారన్నారు. ఇప్పుడు టీఆర్‌ఎస్ ప్రభుత్వం చేయూతనందివ్వడం వల్ల వారి కుల వృత్తి చేసుకుని హాయిగా జీవిస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

# సరిహద్దుల్లో చొరబాట్లను తిప్పికొట్టాం

## భారత్ ప్రతిఘటనలతో పాక్ నుంచి తగ్గిన చొరబాట్లు
## సరిహద్దుల్లో పెద్ద ఎత్తున ఆయుధాలు స్వాధీనం

న్యూఢిల్లీ,అక్టోబర్10(ఆర్‌ఎన్‌ఎ): సరిహద్దుల్లో చొరబాటు యత్నాలను ఈ ఏడాది భారత బలగాలు చాలావరకూ తిప్పికొట్టాయని, అంతర్గత పరిస్థితి మెరుగపడటానికి ఇది ఉపకరిస్తుందని ఆర్మీ అధికారి లెఫ్టినెంట్ జనరల్ బీఎస్ రాజు తెలిపారు. శనివారంనాడిక్కడ మీడియాతో ఆయన మాట్లాడుతూ, విస్తృత స్థాయిలో ఈ ఏడాది సరిహద్దు చొరబాట్లను అడ్డుకున్నామని చెప్పారు. గత ఏడాది పాక్ నుంచి సుమారు 130 చొరబాటు యత్నాలు జరుగగా, ఈ ఏడాది అది 30 కంటే తక్కువేనని అన్నారు. ఇందువల్ల అంతర్గత పరిస్థితులు కూడా మెరుగయ్యే అవకాశాలుంటాయని చెప్పారు. ఇంటెలిజెన్స్ ఏజెన్సీల సమాచారం మేరకు పాకిస్థాన్ వైపు 250 నుంచి 300 వరకూ టెర్రరిస్టు లాంచ్‌ప్యాడ్లు ఉన్నాయని చెప్పారు. కాగా, కెరన్ సెక్టార్‌లో పాకిస్థాన్ మద్దతుతో టెర్రరిస్టులు పీఓకే నుంచి ఆయుధాలను స్మగుల్ చేసేందుకు జరిపిన యత్నాలను భారత ఆర్మీ శుక్రవారంనాడు సమర్ధవంతంగా నిలువరించిందని ఆయన తెలిపారు. నాలుగు ఏకే 74 రైఫిల్స్, ఎనిమిది మ్యాగజైన్లు, 240 ఏకే రైఫిల్ అమ్యునేషన్‌ను స్మగ్లర్ల నుంచి స్వాధీనం చేసుకున్నామని అన్నారు. షోపియాన్ ఎన్‌కౌంటర్ కేసుపై మాట్లాడుతూ, ప్రాథమిక సమాచారం ఆధారంగా కోర్టు

ఎంక్వైయిరీ ప్రారంభించి ఎక్కడ పొరపాట్లు జరిగాయనే దానిపై ఒక నిర్ధారణకు వచ్చామని, సాక్ష్యాలను లోతుగా విశ్లేషిస్తున్నామని తెలిపారు. షోపియాన్‌లోని అమ్షిపోరలో జూలైన 18న భద్రతా బలగాలతో జరిగిన గన్‌÷ట్‌లో ముగ్గురు యువకులు మృతి చెందారు.

నియంత్రణ రేఖ వద్ద పాక్ దుశ్చర్య

నియంత్రణ రేఖ వెంబడి పాకిస్థాన్ దుశ్చర్యలు కొనసాగుతున్నాయి. కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘనలు, ఆయుధాలు, ఉగ్రవాదుల అక్రమ తరలింపు ఆ దేశానికి నిత్యకృత్యంగా మారింది. అయినప్పటికీ భారత సైన్యం నిరంతర నిఘాతో అప్రమత్తంగా ఉంటూ, పాక్ దుశ్చర్యలను తిప్పికొడుతోంది. శనివారం కూడా పెద్ద ఎత్తున ఆయుధాలను భారత్‌లోకి తరలించేందుకు పాకిస్థాన్ విఫలయత్నం చేసింది. శ్రీనగర్‌లోని చినార్ కార్ప్స్ లెఫ్టినెంట్ జనరల్ బీఎస్ రాజు మీడియాతో మాట్లాడుతూ, శనివారం ఉదయం జమ్మూ-కశ్మీరులోని నియంత్రణ రేఖ వెంబడి కేరన్ సెక్టర్‌లో పాకిస్థాన్ దుశ్చర్యలను అడ్డుకున్నట్లు తెలిపారు. కిషన్ గంగ నది ద్వారా 4 ఏకే-74 రైఫిల్స్‌ను, పెద్ద ఎత్తున మందుగుండు సామగ్రిని అక్రమంగా తరలించేందుకు పాకిస్థాన్ ప్రయత్నించిందని చెప్పారు. వీటిని ఓ ట్యూబులో పెట్టి, తాడుతో కట్టి నది ద్వారా మన దేశంలోకి పంపించేందుకు ప్రయత్నించిందన్నారు. అయితే భారత భద్రతా దళాలు అత్యంత అప్రమత్తంగా ఈ కుటిల యత్నాలను అడ్డుకున్నట్లు తెలిపారు. ఈ ఆయుధాలను, మందుగుండును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. పాకిస్థాన్ ఉద్దేశాల్లో మార్పులు లేవని ఈ సంఘటన మరోసారి స్పష్టం చేస్తున్నట్లు వివరించారు. పాకిస్థాన్ ప్రయత్నాలను భవిష్యత్తులో కూడా విఫలం చేస్తామని చెప్పారు. పాకిస్థాన్ ఇటువంటి ప్రయత్నాలను జమ్మూ సెక్టర్, కేరన్, తంగ్‌ధర్, పంజాబ్‌లలో చేస్తోందన్నారు. ఉగ్రవాదంలో కశ్మీరీల ప్రమేయం నిరంతరం ఉండాలన్నదే పాకిస్థాన్ అసలు ఉద్దేశమని చెప్పారు. అయితే ఆయుధాల రాకను ఆపాలన్నదే తమ దృఢ నిశ్చయమని చెప్పారు. స్థానికులకు జరిగే నష్టం అతి తక్కువగా ఉండాలన్నదే తమ లక్ష్యమని తెలిపారు. ఉగ్రవాదాన్ని అంతం చేయడానికి ప్రజల సహకారం అవసరమని చెప్పారు.

# పిడుగుపాటుకు బాలిక మృతి

నల్లగొండ,అక్టోబర్10(ఆర్‌ఎన్‌ఎ): నల్లగొండ జిల్లాలో దారుణం జరిగింది. పిడుగుపాటుకు ఓ బాలిక బలయ్యింది. పొలం పనులకు వెళ్లిన యువతి పిడుగుపడి మృతి చెందింది. నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం మడమడక గ్రామంలో ఈ ఘటన జరిగింది. మడమడక గ్రామానికి చెందిన ఏటెల్లి పార్వతి(17) ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. శుక్రవారం ఉదయం పని నిమిత్తం తండ్రి తిరుపతయ్యతో కలిసి గ్రామశివారులోని పొలానికి వెళ్లింది. సాయంత్రం ఉరుములు, మెరుపులతో వర్షం ప్రారంభం కావడంతో తండ్రీకూతురు పొలంలోని చెట్టు కిందకు వెళ్లారు. ఒక్కసారిగా చెట్టుపై పిడుగు పడటంతో పార్వతి అక్కడికక్కడే మృతి చెందగా తండ్రికి తీవ్రగాయాలయ్యాయి. బాధితుడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు.

## చరిత్రలో నేటినిజం



కం॥ ప్రౌఢాధికముగ - మనగ్రా
మీణ సమాజమ్మును కుసుమింపగ జేయున్
నానాగతుల శ్రమించిన
"నానాజీ దేశముఖు"కు నతులందింతున్

(అక్టోబర్ 11 నానాజీ దేశముఖ్ జయంతి..)

-రాధశ్రీ

సెల్: 9494481210



# ప్రజల ఆస్తుల భద్రతకే సర్వే

## -అందరూ నమోదు చేయించుకోవాలన్న ఎర్రబెల్లి

వరంగల్ రూరల్,అక్టోబర్10 (ఆర్‌ఎన్‌ఎ): ప్రభుత్వం ప్రజల ఆస్తులకు భద్రత కల్పించేందుకే ఆస్తుల నమోదు కార్యక్రమాన్ని చేపట్టిందని, ప్రజలందరూ సహకరించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విజ్ఞప్తి చేశారు. ధరణి పోర్టల్‌లో అందరి ఆస్తుల చిట్టాలను నమోదు చేసే కార్యక్రమం జరుగుతోందన్నారు. దీనికి ప్రజలు సహకరించాలన్నారు. రాయపర్తి మండలంలోని రాగన్నగూడెం గ్రామాన్ని మంత్రి ఎర్రబెల్లి శనివారం సందర్శించి.. ఆస్తుల నమోదుకు సంబంధించిన అపోహలు, అనుమానాలను నివృత్తి చేసి ప్రజలను చైతన్య పరిచారు. గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన మైక్‌లో మంత్రి మాట్లాడుతూ.. నేను మీ ఎర్రబెల్లి దయాకర్ రావుని...! మీ అభిమాన ఎమ్మెల్యేని... మంత్రిని అంటూ ప్రజల ఆస్తుల నమోదుపై వివరణ ఇచ్చారు. ప్రజలంతా దయన్నా! అని అభిమానంగా పిలుచుకునే మంత్రి నేరుగా తమతో మాట్లాడుతుండటంతో... ఒక్కసారిగా ప్రజలంతా అలర్ట్ అయ్యారు. మంత్రి చెప్పే మాటలన్నీ సావధానంగా విన్నారు. ప్రజల ఆస్తుల నమోదు కార్యక్రమానికి సహకరించాలని కోరారు. భద్రత, భరోసా, ఆస్తుల విలువను పెంచడం కోసమే సీఎం కేసీఆర్ ప్రజల ఆస్తులను నమోదు చేయాలని నిర్ణయించారన్నారు. ప్రజలు ఎలాంటి అనుమానాలు, అపోహలున్నా తొలగించకోవాలని చెప్పారు. అలాగే, గ్రామంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. ప్రజల ఆశీర్వాదంతో మంచి స్థానాన్ని సీఎం కేసీఆర్ ఇచ్చారని, ప్రజల అభివృద్ధికే తాను పాటుపడతానని మంత్రి ప్రజలకు వివరించారు. నిత్యం ప్రజల మధ్యే ఉంటే మంత్రి, ఇలా తమతో మమేకం అవడంతో ఆ గ్రామ ప్రజల ఎంతో సంతోషించారు.

కొత్త రెవెన్యూ చట్టంలో భాగంగా ప్రజల ఆస్తులను నమోదు చేస్తున్న అధికారులతో మంత్రి దయాకర్‌రావు మాట్లాడారు. నమోదు ఎలా జరుగుతుంది? ప్రజల సహకారం ఎలా ఉంది? నమోదు పూర్తవడానికి ఎంత సమయం పడుతుంది? అని మంత్రి అడిగారు.

# రాజేంద్రనగర్‌లో మరోమారు చిరుత కలకలం

హైదరాబాద్,అక్టోబర్10(ఆర్‌ఎన్‌ఎ): రాజేంద్రనగర్‌లో మరోసారి చిరుత కలకలం సృష్టించింది. అర్ధరాత్రి రెండు ఆవులపై దాడి చేసింది. దీంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. చిరుత కాలు ముద్రలను చూసి? అటవీ శాఖ అధికారులకు స్థానికులు సమాచారం ఇచ్చారు. దీంతో ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు, స్థానికులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. రాజేంద్రనగర్ ఏరియాలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు పోలీసులు. అయితే ఆరు నెలలుగా చిరుత రాజేంద్రనగర్ అటవీలో తిరుగుతున్న కూడా పట్టించుకోవటం లేదని మండిపడుతున్నారు. వెంటనే సీసీ కెమెరాలు, బోన్లు ఏర్పాటు చేసి చిరుతను పట్టుకోవాలంటున్నారు.

# తన ఇంటిని అమ్మాలని చూస్తున్నారు

## దళిత మహిళ ఆందోళన

హైదరాబాద్,అక్టోబర్10(ఆర్‌ఎన్‌ఎ): నగరంలోని అంబర్‌పేట్ అలీ కేఫ్ న్యూ అంబేద్కర్ నగర్‌కు చెందిన దళిత మహిళ జగదీశ్వరి తన భూమిని అమ్మాలని చూస్తున్నారని ధర్నాకు దిగారు. తనకు న్యాయం చేయాలని కోరుతూ ఇంటిముందు కిరోసిన్ డబ్బా పట్టుకొని ధర్నాకు దిగారు. తన తల్లి కష్టపడి సంపాదించిన ఇంటిని ఇతరులకు అమ్మడానికి ప్రయత్నిస్తున్న టీఆర్‌ఎస్ నేత ఆయిల్ అంజయ్యపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేసారు. ఈ విషయమై ఇప్పటికే పలుమార్లు పోలీసులకు

ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదని జగదీశ్వరి వాపోయారు. పోలీసులు తన ఫిర్యాదును తీసుకోవట్లేదని ఆమె కన్నీటిపర్యంతమయ్యారు. పోలీసులు కూడా టీఆర్‌ఎస్ నేతకే సపోర్ట్ చేస్తున్నారని ఆమె చెబుతున్నారు. తనకు న్యాయం చేయకుంటే కిరోసిన్ పోసుకొని ఆత్మహత్య చేసుకుంటానని జగదీశ్వరి చెబుతున్నారు.

# రాజకీయ నాయకుల అవినీతి నిగ్గు తేలేనా ?

నేటినిజం
ఆదివారం 11-10-2020

సుప్రీంకోర్టు ఆదేశాలతో రాజకీయ నాయకులపై కేసులు ఏడాదిలోగా విచారణ పూర్తి చేయాలన్న సుప్రీం ఆదేశాల మేరకు కేసుల విచారణపై ఆయా రాష్ట్రాల హైకోర్టులు వేగం పెంచాయి. దేశవ్యాప్తంగా రాజకీయ నాయకుల అవినీతి కేసుల ఫైళ్ల దుమ్ముదులిపే కార్యక్రమం మొదలయ్యింది. అయితే ఇవి సజావుగా సాగుతాయా..వాటిని సాగనిస్తారా అన్నది చూడాలి. కోర్టుల తీర్పులను పక్కన పెడుతున్న నేతలు తమకు వ్యతిరేకంగా వచ్చే తీర్పులను స్వాగతిస్తారని చెప్పడానికి లేదు. చంద్రబాబు లాంటి వారు అవినీతి కేసులపై స్టేలు తెచ్చుకున్నారు. రాజకీయాల్లోకి వచ్చి అవినితికి పాల్పడిన నేతలు కోట్లకు పడగెత్తారు. సుప్రీం ఆదేశాలతో ఓటుకునోటు కేసుపై హైకోర్టులో విచారణ మొదలయ్యింది. అలాగే జనగ్ అక్రమాస్తుల కేసులపైనా రోజువారీ విచారణ జరుగనుంది. చంద్రబాబుపై కేసులను లక్ష్మీపార్వతి మళ్లీ తిరగదోడుతోంది.

మొత్తంగా తెలుగు రాష్ట్రాల రాజకీయ నేతల్లో కలవరం మొదలైంది. రాజకీయ నేతలపై నమోదైన క్రిమినల్ కేసులతో పాటు ఇరత కేసులను త్వరితగిన విచారించేందకు తెలంగాణ హైకోర్టు సిద్ధమైంది. అందులో భాగంగా కోవిడ్ 19 నిబంధనలను పాక్షికంగా సడలించినట్లు హైకోర్టు ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. దీంతో రాజకీయ పార్టీల నేతలు విచారణకు హాజరుకావాల్సి వస్తుందా లేదా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో సిట్టింగ్, మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలపై 223 క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని అమికస్ క్యూరీ విజయ్ హన్సారియా సుప్రీం కోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఏసీబీ కేసులు ఎదుర్కొంటున్న వారి జాబితా కూడా చేర్చితే సంఖ్య మరింత పెరుగుతుందని న్యాయ వర్గాలు తెలిపాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక సహా చాలా రాష్ట్రాల్లో పెద్దఎత్తున ప్రజా ప్రతినిధులు కేసులు ఎదుర్కొంటుండగా ఈ రాష్ట్రాల్లో కేవలం ఒక్కొక్కటి చొప్పునే ప్రత్యేక కోర్టులు ఉన్నాయని అమికస్ క్యూరీ సుప్రీం దృష్టికి తీసుకొచ్చారు. దేశంలో నేరచరిత కలిగిన నేతలంతా అత్యధికంగా ఉత్తప్రదేశ్ లోనే ఉన్నారు. మొత్తం 1,217 కేసులుండగా, ఇందులో 446 మంది సిట్టింగ్ ఎంపీలు,ఎమ్మెల్యేలు ఉన్నారు. జీవిత ఖైదుకు శిక్షార్హమైన కేసులు116 ఉన్నట్లు సుప్రీంకోర్టు దృష్టికి వచ్చింది. బీహార్‌లో 531, తమిళనాడు 324, మహారాష్ట్ర 330, ఒడిశా 331, మధ్యప్రదేశ్ 184, ఆంధప్రదేశ్ 106, పశ్చిమ బెంగాల్ 131, కర్ణాటకలో 164 పెండింగ్ కేసులున్నాయి. తెలంగాణలో118 కేసులు ఉండగా, వీటిలో 107 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలు నిందితులుగా ఉన్నారని, ఈ కేసులన్నీ హైదరాబాద్‌లోని ప్రత్యేక కోర్టు ముందు పెండింగ్‌లో ఉన్నాయి.తెలంగాణలో 2012 నుంచి కేసులు పెండింగులో ఉన్నప్పటికీ అనేక కేసుల్లో నిందితులకు ఇంకా సమన్లు కూడా జారీ చేయలేదని తెలుస్తోంది. కాగా తెలుగు రాష్ట్రాలకు చెందిన వివిధ పార్టీల నేతలు ప్రస్తుతం కొందరు ప్రభుత్వంలో ఉన్నత పదవుల్లో ఉన్నారు. మరికొందరు ప్రతిపక్ష పార్టీల నాయకులుగా కొనసాగు తున్నారు. అయితే అధికారపార్టీ నేతలు తమపై ఉన్న కేసుల విషయంలో న్యాయస్థానాలకు వెళ్లాల్సి వస్తుందేమోననే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ ప్రాంతానికి చెందిన కొందరు నేతలు మాత్రం తెలంగాణ ఉద్యమంలో భాగంగా తమపై అక్రమ కేసులు పెట్టారని,విచారణలో తాము ఎలాంటి తప్పు చేయలేదని రుజువు అవుతుందనే ధీమా వ్యక్తం చేస్తున్నారు. దేశంలోని కార్యనిర్వాహక, శాసన వ్యవస్థలతో పోలిస్తే న్యాయవ్యవస్థపై సాధారణ ప్రజానీకంలో ఇప్పటికీ గౌరవప్రపత్తులున్నాయి. అడపాదడపా అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తమైన సందర్భాలు లేకపోలేదు. కానీ మొత్తంగా మిగిలిన రెండింటితో పోలిస్తే అది మెరుగన్న అభిప్రాయమే బలంగా వుంది. అందులో ఉన్నత ప్రమాణాలు నెలకొల్పిన న్యాయమూర్తులే ఇందుకు కారణం. నిజానికి బయటవారితో పోలిస్తే వారే అవినీతిని బాహాటంగా ఎత్తిచూపారు. ఇందుకు జస్టిస్ కృష్ణయ్యర్ మొదలుకొని జస్టిస్ కట్జూ వరకూ ఎందరినో ఉదాహరించవచ్చు. న్యాయమూర్తులుగా పనిచేస్తున్నప్పుడూ, రిటైరయ్యాక కూడా వారు నిజాయితీగానే పనిచేశారు. న్యాయపీఠంపై వున్నవారిలో కనీసం 20 శాతంమంది అవినీతిపరులని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన జస్టిస్ వెంకటాచలయ్య చెప్పిన మాటను ఎవరూ మరిచిపోరు. న్యాయమూర్తుల్లో రెండు రకాల వారున్నారని న్యాయం తెలిసినవారు, కేంద్ర న్యాయమంత్రి తెలిసినవారు అని విపక్షంలో వున్నప్పుడు బీజేపీ నేత స్వర్గీయ అరుణ్ జైట్లీ చమత్కరించారు. అలహాబాద్ హైకోర్టుపై పదేళ్ల క్రితం సుప్రీంకోర్టు ధర్మాసనం చేసిన వ్యాఖ్యలు పెను సంచలనానికి దారితీశాయి. ఇతర వ్యవస్థలకూ, న్యాయవ్యవస్థకూ మధ్య మౌలికంగా వ్యత్యాసం వుంది. మిగతా రెండు వ్యవస్థల్లో పనిచేసేవారు ఇతర వ్యవస్థలపై లేదా తమ వ్యవస్థలపై విమర్శలు చేయలేరు. నిబంధనలు ఒప్పుకోవు. ఒక్క న్యాయవ్యవస్థ మాత్రమే ఎవరి లోపాలనైనా నిశితంగా విమర్శించగలదు. అటువంటి అధికారమూ, హక్కూ వున్న వ్యవస్థ మరీ ఇంత సున్నితంగా వుండటం సబబు కాదు. విమర్శలను మాత్రమే కాదు..ఆ విమర్శలు చేస్తున్నవారెవరో, వారి ఉద్దేశాలేమిటో, అందుకు దారితీస్తున్నవేమిటో కూడా పరిగణనలోకి తీసుకోవాలి. అలాగని న్యాయమూర్తులను బెదిరిస్తే, కించపరిస్తే సహించాలని ఎవరూ చెప్పరు. న్యాయవ్యవస్థతోసహా వ్యక్తులకైనా, వ్యవస్థలకైనా కావలసింది పారదర్శకత, జవాబుదారీతనం. ఆ రెండూ లోపించినా, అవి తగినంతగా లేకపోయినా విమర్శలు రాకతప్పదు. అయితే న్యాయవ్యవస్థ చొరవ కారణంగానే ఇప్పుడు రాజకయా నేతల అక్రమాలపై ఉన్న కేసుల్లో విచారణలు త్వరగా అంటే ఏడాదిలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని జస్టిస్ రణ నేతృత్వంలోని ధర్మాసం హైకోర్టులను ఆదేశించింది. దీంతో ఆయా కేసుల్లో ఇక రోజువారీ విచారణ చేపట్టాలని హైకోర్టులు నిర్ణయించాయి. ఈ మేరకు ఆయా కేసుల్లో త్వరగా విచారణ చేయాలన్న ప్రజాప్రయోజన వ్యాజ్యం వేసిన వారు అభినందనీయులు అవినీతి పాలకుల భరతం పడితే ప్రజలు హర్షిస్తారు. శిక్షపడితే మరింతగా హర్షిస్తారు. భవిష్యత్‌లో ఏం జరుగుతుందన్నది ఇక కోర్టుల తీర్పును బట్టి ప్రజల స్పందన ఉండనుంది.

## వ్యవసాయేతర ఆస్తుల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి

- సంబంధిత అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ హనుమంతరావు.



సంగారెడ్డి, అక్టోబర్ 10 (నేటినిజం ప్రతినిధి): శుక్రవారం సాయంత్రం సాయంత్రం 7 గంటలకు సదాశివపేట మండలం ఆరూర్ గ్రామంలో ఆస్తుల నమోదు ప్రక్రియను కలెక్టర్ హనుమంతరావు ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పరిధిలోని ప్రతి నిర్మాణం వివరాలను నమోదు చేయాలన్నారు. యజమాని పేరు, ఆధార్ నంబర్, చరవాని నంబర్, నిర్మాణం స్వభావం, విస్తీర్ణం తదితర వివరాలు నమోదు చేయాలన్నారు. అన్ని రకాల నిర్మాణాలు ఆన్ లైన్ లో నమోదుతో భవిష్యత్ లో ఎలాంటి ఇబ్బందులు ఉండవని అన్నారు. నమోదు ప్రక్రియను సంబంధిత అధికారులు నిర్ణీత సమయంలోగా వేగవంతంగా పూర్తిచేయాలని సూచించారు.

## చీరల పంపిణీ ఆత్మగౌరవ ప్రతీక

**మహిళలను ఆదరించిన ఘనత కెసిఆర్ది**

**మహిళా ప్రతినిధుల వ్యాఖ్య**

హైదరాబాద్,అక్టోబర్10(ఆర్ఎన్ఎ): తెలంగాణలో చీరల పంపిణీతో ఆడబిడ్డల ముఖాల్లో చిరునవ్వులు కనిపిస్తున్నాయి. బతుకమ్మ చీరల పంపిణీ ఉత్సాహంగా మొదలు కాగా, ఎక్కడ చూసినా పండుగ వాతావరణం కనిపిస్తోంది. ఆయా చోట్ల ఎమ్మెల్యేలు,మంత్రులు చీరలను పంపిణీ చేశారు. [illegible]

## బిజెపి నేతల నోట్లో పచ్చి వెలక్కాయి

**-వైకాపా దగ్గరయ్యిందన్న వార్తలతో ఉక్కిరిబిక్కిరి**

అమరావతి,అక్టోబర్10(ఆర్ఎన్ఎ): ఎన్డీయేలో చేరమని బీజేపీ అధిష్టానం వైకాపాని ఆహ్వానించింది. [illegible]

# దుబ్బాక ఉప ఎన్నికల్లో పుంజుకున్న ప్రచారం

**ఎదుటి పార్టీ వారి చేర్చుకోవడంలో నేతల దృష్టి**

**మానసికంగా ఎదుటి వారిని దెబ్బతీసే యత్నాల్లో టీఆర్ఎస్**

సిద్దిపేట,అక్టోబర్10(ఆర్ఎన్ఎ): దుబ్బాక ఉప ఎన్నికల్లో రాజకీయం మరింత హీటెక్కింది. అన్ని పార్టీల నేతలు సుడిగాలి పర్యటనతో హోరెత్తిస్తున్నారు. విమర్శలు.. ప్రతి విమర్శలతో నియోజకవర్గం అంతా చుట్టేస్తున్నారు. ప్రధానంగా రజాకీయ పార్టీల నేతలు ఆకర్ష పథకంతో ఎదుటి పార్టీల వారిని ఆత్మరోణిలో పడేయాలన్న ధ్యేయంతో ముందుకు సాగుతున్నారు. ఫలాన పార్టీకి చెందిన ప్రముఖులు మా పార్టీలో చేరడంతో ఆ పార్టీ ఖాళీ అయ్యిందన్న ప్రచారానికి తెర తీసారు. ఓ వైపు పరస్పర విమర్శలతో ఎదురు దాడి చేస్తూనే చేరికతలో ఎదుటి పార్టీ వారిని దెబ్బకొట్టాలని, ప్రజల్లో ఓ రకమైన ప్రచారన్ని వదులుతున్నారు. చేరికలతో ఆ పార్టీ పని అయిపోయిందన్న భానలు వ్యాప్తి చేస్తున్నారు. మొత్తంగా బరిలో ఉన్న కాంగ్రెస్, బిజెపిలను లక్ష్యంగా చేసుకుని అధికార టిఆర్ఎస్ ఎదురుదాడి చేస్తోంది. పార్టీల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. అన్ని పార్టీల రాష్ట్ర స్థాయి నేతలు ఇక్కడే మకాం వేసి అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేస్తున్నారు. నామినేషన్లు కూడా మొదలవడంతో ప్రలోభాలు పర్వానికి తెరలేవడంతో.. దుబ్బాక ఉపఎన్నికల ప్రచారం మరింత ఊపందుకుంది. కాంగ్రెస్ నుంచి టికెట్ ఆశించిన వెంకట నరసింహా రెడ్డి, మనోహర్ లు మంత్రి హరీష్ రావు సమక్షంలో కారెక్కారు. కాంగ్రెస్ నేతలు ఎన్నికలప్పుడే దుబ్బాక వస్తారని మళ్లీ ఎవరు పట్టించుకోరని విమర్శించారు మంత్రి హరీష్. ఇక కాంగ్రెస్ నేతలు సైతం మండలాల వారీగా తమ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం చేస్తున్నారు. గ్రామాల వారీగా ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయతిస్తున్నారు. దుబ్బాక అభివృద్ధి జరిగింది కాంగ్రెస్ హయాంలోనే ముత్యంరెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే అని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, ఉత్తమ్ తదితరులు ప్రచారం చేస్తున్నారు. ఆ తర్వాత అభివృద్ధి ఏమి కనిపించడం లేదన్నారు. బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు కూడా ఇప్పటికే ప్రతి గ్రామాన్ని ఒక్కసారి చుట్టి వచ్చారు. ఎన్నికల ఇంచార్జ్ జితేందర్రెడ్డి ఎప్పటికప్పుడు ముఖ్య నేతలు కార్యకర్తలతో సమావేశం అవుతున్నారు. టీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం బిజెపి అని ప్రచారంలో దూసుకుపోతున్నారు. మరో వైపు దుబ్బాక ఉపఎన్నికల్లో గెలుపొందేందుకు ప్రలోభ పర్వం మొదలైంది. నియోజవకర్గంలో బీజేపీ నేతలు... మహిళలకు పంచేందుకు సిద్ధం చేసిన చీరలను ఈసీ పట్టుకుంది. బీజేపీ నేతలు చీరలు పంపిణీ చేస్తున్నట్టు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. మొత్తానికి దుబ్బాక ఉప ఎన్నికల్లో అన్ని పార్టీల నేతల ప్రచారంతో రాజకీయ వేడి పెరిగింది. ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో తమకు ఉన్న అన్ని వనరులను ఉపయోగించి గెలవాలని ఈ మూడు పార్టీలు ప్రయత్నం చేస్తున్నాయి. ఎక్కడికక్కడ సభలు సమావేశాలతో కేడర్లో ఉత్సాహం నింపే ప్రయత్నం చేస్తున్నాయి.

# కరీంనగర్ కమీషనరేట్‌లో ప్రజలకు భద్రతపై భరోసా

**-తొలి కమీషనర్‌గా నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకున్న విబి కమలాసన్‌రెడ్డి**



కరీంనగర్, అక్టోబర్ 10 (నేటినిజం ప్రతినిధి):ప్రజలకు భద్రతపై భరోసా కల్పిస్తూ శాంతిభద్రతల పరిరక్షణ కోసం వినూత్న కార్యక్రమాలతో ముందుకుసాగుతోంది కరీంనగర్ పోలీస్ కమీషనరేట్. తొలి కమీషనర్ భాద్యతలు చేపట్టిన విబి కమలాసన్‌రెడ్డి నేటితో (ఈనెల 11 ఆదివారం) నాలుగు సంవత్సరాలు సమర్ధవంతమైన సేవలతో పూర్తి చేసుకున్నారు.

తెలంగాణ ప్రభుత్వం జిల్లాల పున:నిర్మాణంలో భాగంగా శాంతిభద్రతల పరిరక్షణకు పెద్దపీట వేయాలనే లక్ష్యంతో ప్రజలకు పటిష్టమైన భద్రత కల్పించాలనే, వ్యవస్థీకృత నేరాలకు అడ్డుకట్ట వేయాలనే ధ్యేయంతో ఏర్పాటు చేసిన పోలీస్ కమీషనరేట్‌లలో ఒకటైన కరీంనగర్ పోలీస్ కమీషనరేట్ ఏర్పాటైన అనతికాలంలోనే శాంతిభద్రతలను పటిష్ట పరుచుటకు బలమైన పునాదులు వేయడమే కాకుండా వినూత్నమైన పద్దతులను ఎప్పటికప్పుడు అవలంభిస్తూ ఒకవైపు నేరాలను అదుపు చేయడం మరోకవైపు నేరాల నియంత్రణలో పాశ్చాత్యదేశాలు, అభివృద్ధి చెందిన దేశాలకు మాత్రమే సాధ్యమయ్యే ఆధునిక టెక్నాలజీని వినియోగిస్తూ కరుడుగట్టిన నేరస్థులను సైతం కటకటలా వెనక్కు పంపి ప్రజలకు పోలీస్ వ్యవస్థపై అపారమైన విశ్వాసాన్ని పెంచడమే కాక ప్రతి ఒక్కరిలో భద్రతాభావాన్ని పెంపొందించడంలో అనితరసాధ్యమైన విజయం సాధించింది. ఒకవైపు నూతనంగా ఏర్పడిన కమీషనరేట్‌కు కావాల్సిన అన్ని హంగులు సమకూర్చుకుంటూ, శాంతిభద్రతలను కాపాడుతూ ప్రజలకు మరింత చేరువ కావడానికి చేపట్టిన పలు కార్యక్రమాల వల్ల పోలీసులు ప్రజలకు ఆత్మీయులు అనే భావన, పోలీసులు ప్రజలను కంటికిరెప్పలా కాపాడుటకు 24గంటలు తమ వెనుక ఉన్నారనే ధీమా కల్పిస్తూ నేరరహిత సమాజం నిర్మాణం వైపు పరుగులు తీస్తోంది. కరీంనగర్ పోలీస్ కమీషనరేట్ పరిధిలో ప్రజల భద్రతకు భరోసా కల్పించేందుకు చేపడుతున్న సంస్కరణలతోపాటు శాంతియుత వాతావరణం నిర్మాణం కోసం అమలవుతున్న వివిధ రకాల కార్యక్రమాల వివరాలు ఇలా ఉన్నాయి.

### బ్లూకోల్ట్స్:

రేయింబవళ్ళు గస్తీ నిర్వహిస్తూ, ప్రజలకు సత్వర సేవలందించే ఉద్దేశంతో ఏర్పాటు చేయబడిన బ్లూకోల్ట్స్ సత్ఫలితాల నిస్తోంది. సమాచారం అందిన 03 నుండి 04 నిమిషాల వ్యవధిలో సంఘటన స్థలానికి చేరుకుని సేవలందిస్తున్నాయి. ప్రజల భద్రత కోసం కమీషనరేట్ పోలీసులు చేపడుతున్న వివిధ కార్యక్రమాలపై సమావేశాలను నిర్వహిస్తూ బ్లూకోల్ట్స్ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. అన్ని వర్గాల ప్రజలతో ప్రతినిత్యం సమావేశాలు నిర్వహిస్తుండటంతో ప్రజలతో సన్నిహిత సంబంధాలు పెంపొందుతున్నాయి. బ్లూకోల్ట్స్ విభాగం ఏర్పాటు ద్వారా నేరాలు నియంత్రణలోకి వస్తున్నాయి.

### కార్డన్ అండ్ సెర్చ్‌లు:

అసాంఘీకశక్తుల కదలికల నియంత్రణ, అక్రమ కార్యకలాపాలకు అడ్డుకట్టవేసేందుకు కమీషనరేట్ పరిధిలో కొనసాగిస్తున్న కార్డన్అండ్‌సెర్చ్‌లతో ఆశించిన ఫలితాలు వస్తున్నాయి. అంగులఅంగులం సోదాలను నిర్వహిస్తూ అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడే నేరస్థులకు గుబులు పుట్టిస్తూ వారు కరీంనగర్ వదిలిపోయేలా ఆప్రాంత ప్రజల్లో భద్రతాభావం పోలీసుల పట్ల కృతజ్ఞతభావం పెంపొందేలా చేస్తున్నవి.

ప్రజలు నమ్మలేనిరకంగా జరుగుతున్న అనేకరకాల అక్రమ కార్యకలాపాలు వెలుగు చూస్తున్నాయి. అనుమానితుల వేలిముద్రలను అక్కడే సేకరించి వారు ఏప్రాంతం వారు గతంలో ఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో నేరాలకు పాల్పడినారు, ఏదైనా పోలీస్‌స్టేషన్ పరిధిలో వారు అవసరం ఉండి అరెస్టు కాకుండా పరారీలో ఉన్న నిందితులా?అని తెలుసుకుంటూ ఎంతోమందిని నిందితులను పట్టుకోవడం జరిగింది.

### షీటీమ్స్:

మహిళలు, విద్యార్థినులు వివిధ రకాల వేధింపులకు గురవ్వకుండా పోకిరీల ఆటకట్టించేందుకు ఏర్పాటు కాబడిన షీటీంలు సమర్ధవంతంగా పనిచేస్తున్నాయి. వేధింపులను ఎదుర్కొనే మహిళలు సెల్, వాట్సాప్, ఫేస్‌బుక్, హాక్ఐ యాప్‌ల ద్వారా షీటీంలకు సమాచారం అందిస్తున్నారు. సత్వరం స్పందిస్తూ ఆధారాలతో సహా పోకిరీలను పట్టుకోవడం జరుగుతున్నది. ఆధారాల సేకరణకు ఆధునిక సాంకేతిక పరికరాలను వినియోగిస్తున్నారు.

### డ్రంక్ అండ్ డ్రైవ్:

హైదరాబాద్ నగరం తర్వాత మద్యం సేవించి వాహనాలు నడిపే వారిని నియంత్రించడంతోపాటు ప్రజలకు అవగాహన కల్పించడంలో కరీంనగర్ కమీషనరేట్ ముందజలో కొనసాగుతోంది. ప్రజల భద్రత, ప్రమాదాల నియంత్రణ కోసం కొనసాగిస్తున్న డ్రంక్అండ్ డ్రైవ్‌లు సత్ఫలితాలనిస్తున్నాయి. మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడిన వారికి శిక్ష తప్పనిసరిగా విధించబడుతుండటంతో మందుబాబులు వాహనాలు నడిపేందుకు జంకుతున్నారు. మద్యంసేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారి లైసెన్సుల రద్దుకోసం ప్రతిపాదనలు పంపిస్తుండటంతో వారి లైసెన్సులు రద్దవుతున్నాయి. ఇప్పటి వరకు కమిషనరేట్ పరిధిలో 170కిపైగా మంది వాహనదారుల లైసెన్సులు రద్దుకాబడ్డాయి.

### ఆపరేషన్ నైట్‌సేఫ్టీ:

తల్లిదండ్రుల పర్యవేక్షణ కరువై రాత్రి వేళల్లో మద్యం,మత్తు పదార్థాల సేవించి రోడ్లపై వివిధ రకాల వాహనాలతో సంచరించే యువతను సన్మార్గంలో పయనింపజేసేందుకు కమీషనరేట్ పరిధిలో ఆపరేషన్ నైట్‌సేఫ్టీకి శ్రీకారం చుట్టడం జరిగింది. వ్యసనాలకు బానిసలైన యువకులు జల్సాలకు డబ్బులు కరువై వివిధ రకాల దోపిడిలు, దొంగతనాలకు పాల్పడుతున్న సంఘటనలు వెలుగుచూశాయి. యువతను అదుపులో ఉంచి, సన్మార్గంలో పయనింపజేసేందుకు చేపడుతున్న ఈ కార్యక్రమానికి అన్ని వర్గాల ప్రజల సహకారం లభిస్తున్నది. రాత్రి వేళల్లో వాహనాలపై సంచరిస్తూ తటస్థపడిన యువతను అదుపులోకి తీసుకుని వారి వాహనాలను స్వాధీనం చేసుకుని వదిలిపెడుతున్నాము. మరునాడు ఉదయం వారి తల్లిదండ్రులు, సంరక్షకులను పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నాము.

### నాఖాబందీ:

అక్రమ కార్యకలాపాల నియంత్రణకు కమీషనరేట్ పరిధిలో నాఖాబందీలను నిర్వహిస్తున్నాము. నాఖాబందీని కమీషనరేట్ వ్యాప్తంగా ఏకకాలంలో నిర్వహించడం జరుగుతుంది. ఈ సందర్భంగా సరైన ధృవపత్రాలు లేని వాహనాలు, మద్యం సేవించి వాహనాలు నడిపే మందుబాబులు, అక్రమ రవాణా, ఆయుధాలు ధరించి సంచరించే వ్యక్తులు, శాంతికి భంగం కలిగించే వ్యక్తులను పట్టుకోవడం జరుగుతున్నది. ఏకకాలంలో నిర్వహించడం వల్ల సత్ఫలితాలు వస్తున్నాయి.

### హాక్ఐ:

శాంతిభద్రతలకు సంబంధించిన సమస్యలను ప్రజలు నేరుగా పోలీస్‌స్టేషన్‌లకు వచ్చి ఫిర్యాదు చేయాల్సిన అవసరం లేకుండా అన్ని వర్గాల ప్రజల సౌకర్యార్థం రూపొందించిన ప్రత్యేక అప్లికేషన్. స్మార్ట్‌ఫోన్ కలిగి ఉన్న ప్రతి పౌరుడు వినియోగించుకునే అవకాశం ఉంది. వివిధ రకాల సమస్యలనుల ఒక్కమీట నొక్కితే పోలీసులకు చేరే అవకాశం ఉన్న సదుపాయం. హాక్ఐలో ఉన్న వివిధ రకాల సేవలపై అవగాహన కల్పిస్తూ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాము. కమీషనరేట్ వ్యాప్తంగా 95వేలకు పైగా మంది ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఈ యాప్ ద్వారా వివిధ రకాల సమస్యలు పోలీసుల దృష్టికి వస్తున్నాయి. వెంటనే స్పందిస్తూ చర్యలు తీసుకోవడం జరుగుతున్నది. మహిళల భద్రతకు సంబంధించి ప్రత్యేక సదుపాయాలను ఈ యాప్‌లో అందుబాటులో ఉంచారు.

## ఇతర దేశాలకు కూడా చేపల ఎగుమతి

**రాష్ట్రంలో మత్స్య అభివృద్ధికి ప్రత్యేక చర్యలు**

**గతేడాది 3.10 లక్షల టన్నుల చేపల ఉత్పత్తి**

**వెల్లడించిన మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్**

హైదరాబాద్,అక్టోబర్10(ఆర్ఎన్ఎ): రానున్న రోజులలో రాష్ట్రం నుండి ఇతర రాష్ట్రాలు, దేశాలకు చేపలను ఎగుమతి చేసేందుకు ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలను చేపడుతుందని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వెల్లడించారు. మత్స్యరంగ అభివృద్ధికి రాష్ట్రంలో అపారమైన వనరులు, అవకాశాలు ఉన్నాయని అన్నారు.శుక్రవారం పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ కార్యాలయ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల అభివృద్ధి సంస్థ ప్రాంతీయ కార్యాలయాన్ని ఆయన ఎంపీఈడిఎ చైర్మన్ శ్రీనివాస్, పశుసంవర్ధక శాఖ కార్యదర్శి శ్రీ అనిత రాజేంద్రలతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి తలసాని మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు నాయకత్వంలో మత్స్య కార్మికుల అభివృద్ధి కోసం పెద్ద ఎత్తున ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. 5.72 లక్షల హెక్టార్ల నీటి విస్తీర్ణంతో కర్నాటక, తమిళనాడు తర్వాత తెలంగాణ రాష్ట్రం 3వ స్థానంలో ఉందని చెప్పారు. గతసంవత్సరంలో 3.10 లక్షల టన్నుల చేపల ఉత్పత్తి తో తెలంగాణ రాష్ట్రం దేశంలో 8 వ స్థానంలో నిలిచిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో బొచ్చె, రాహు, మ్రిగాల, బంగారుతీగ, గడ్డిచేప వంటి 5 రకాలు మాత్రమే పెంపకం జరుగుతుందని అన్నారు. మత్స్యకారులు అధిక ఆదాయం పొందేందుకు ఎగుమతులకు ఎంతో డిమాండ్ ఉన్న తిలపియా, మంచి నీటి రొయ్యల పెంపకం చేపట్టే విధంగా ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని వివరించారు. రాష్ట్రంలో ఆధునిక పద్దతులలో చేపల పెంపకం, మార్కెటింగ్ సౌకర్యాల విస్తరణ, మత్స్యకారులకు అవసరమైన శిక్షణ కార్యక్రమాల నిర్వహణ కోసం ఎంపీఈడిఎతో ఎంఓయు కుదుర్చుకోవడం జరిగిందని చెప్పారు. రానున్న రోజులలో రాష్ట్రంలో ప్రాసెసింగ్ యూనిట్లు కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రజలకు చేపలను అందుబాటులోకి తీసుకెళ్లేందుకు జీహెచ్ఎంసి పరిధిలోని 150 డివిజన్ లలో డివిజన్ కు ఒకటి చొప్పున మొబైల్ చేపల విక్రయ కేంద్రాలను ప్రారంభిస్తామని అన్నారు. ఈ విక్రయ కేంద్రాలలో చేపలతో పాటు చేపల వంటకాలు కూడా విక్రయించేలా డిజైన్ చేసినట్లు వివరించారు. బహుళజాతి చేపల ఉత్పత్తి కేంద్రాన్ని నిర్మించి నీలకంట రొయ్య, తిలాపియ, పండుగొప్ప, వెన్నామి వంటి రకాలను ఉత్పత్తి చేసేందుకు తోడ్పాటును అందిస్తుందని అన్నారు. రాష్ట్రంలో మరిన్ని జలాశయాలు ఉన్నందున కేజ్ కల్చర్ విధానంలో చేపల పెంపకం చేపట్టడానికి ఎంపీఈడిఎ సహకారం తీసుకుంటామని అన్నారు.

## కొత్త రెవెన్యూ చట్టంతో సమస్యలకు చెక్

**-భారీ ట్రాక్టర్ ర్యాలీలో పాల్గొన్న మంత్రి**

కుమ్రంభీం ఆసిఫాబాద్,అక్టోబర్10(ఆర్ఎన్ఎ): కొత్త రెవెన్యూ చట్టాన్ని స్వాగతిస్తూ జిల్లాలో రైతులు భారీ ర్యాలీ నిర్వహించారు. వంద ట్రాక్టర్లు, ఐదు వందల బైకులతో చేపట్టిన ర్యాలీలో మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కోవలక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు పాల్గొన్నారు. వాంకిడి మండల కేంద్రం నుంచి ఆసిఫాబాద్ జిల్లా కేంద్రం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. రైతుల భూములతో పాటు వారి ఆస్తులు, పంటలకు ఎలాంటి నష్టం రాకుండా చూసుకుంటున్నారని తెలిపారు. కొత్త రెవెన్యూ చట్టం పేదలకు వరంగా మారిందన్నారు. క్షేత్రస్థాయిలో పంచాయితీలు లేకుండా భూములకు పక్కాగా హక్కులు దక్కుతాయని అన్నారు. కొత్త రెవెన్యూ చట్టాన్ని సీఎం కేసీఆర్ తీర్చిదిద్దారని ఇంద్రకరణ్‌రెడ్డి పేర్కొన్నారు. భూ తగాదాలు, అవినీతికి తావులేకుండా బిల్లును పకడ్బందీగా తయారు చేసినట్లు తెలిపారు.

రెవెన్యూ చట్టాన్ని మార్చి భవిష్యత్‌లో భూ తగాదాలు రూపు మాపడమే సీఎం కేసీఆర్ లక్ష్యమని అన్నారు. అవినీతికి తావివ్వకుండా కొత్త రెవెన్యూ చట్టాన్ని ప్రభుత్వం రూపొందించిందని జడ్పీ ఛైర్‌పర్సన్ కోవ లక్ష్మి పేర్కొన్నారు. రైతుల భూములకు ఇంచు కూడా తేడా రానివ్వబోమని చెప్పారు. దేశంలో కొవిడ్-19 కష్టకాలంలోనూ అన్ని పథకాలను కొనసాగిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అని కొనియాడారు. రాబోయే కాలంలో రైతులు ఇబ్బందులు పడకుండా కేసీఆర్ అహర్నిశలు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. రైతులు పండించిన పంటను గిట్టుబాటు ధరకు కొంటున్నారని తెలిపారు. భూ వివాదాలు లేకుండా ఉంటే రైతులకు ఆనందం కలుగుతుందనే ఈ సాహసోపేతమైన నిర్ణయాన్ని తీసుకొని అసెంబ్లీలో కొత్త రెవెన్యూ చట్టం తీసుకువచ్చినట్లు చెప్పారు. ఈ చట్టం ద్వారా రైతుల భూముల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి భద్రత కల్పిస్తామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన వ్యవసాయ బిల్లులు రైతులకు అన్యాయం చేసేలా ఉన్నాయని మండిపడ్డారు. ఏజెన్సీ ప్రాంతంలో ఏళ్ల భూములు సాగు చేసుకుంటున్న గిరిజనేతర రైతులకూ రైతుబంధు వర్తించేలా కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తామని హామీనిచ్చారు.

## రాజస్థాన్‌లో సజీవ దహనంపై సమాధానం చెప్పండి

**ప్రభుత్వం ఫైవ్ స్టార్ హోటళ్లో ఉండడమే కారణం**

**పూజారి సజీవ దహనంపై రాజ్యవర్ధన్ సవాల్**

జైపూర్,అక్టోబర్10(ఆర్ఎన్ఎ): రాజస్థాన్ రాష్ట్రం కరౌలిలో ఆలయ అర్చకుడిని సజీవ దహనం చేయడం రాజకీయ దుమారానికి తెరతీసింది. ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ నేతలు విమర్శించారు. రాజస్థాన్‌లో ఎవరికీ రక్షణ లేకుండా పోయిందని బీజేపీ నేత రాజ్యవర్ధన్‌సింగ్ రాథోడ్ మండిపడ్డారు. మహిళలకు, చిన్నారులకు ఆఖరికి ఆలయ పూజారులకు కూడా రక్షణ లేకుండా పోయిందని విమర్శించారు. ప్రభుత్వం నెలల తరబడి ఫైవ్ స్టార్ హోటళ్లలో కూర్చుని తనను తాను కాపాడుకోవడమే సరిపోతున్నదని రాజ్యవర్ధన్‌సింగ్ ఎద్దేవా చేశారు. ప్రజల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నా ప్రభుత్వం రక్షణ కల్పించే ప్రయత్నం చేయడం లేదని ఆయన విమర్శించారు. గెహ్లాట్ ప్రభుత్వ తీరుతో నేరాలు పెరిగిపోయి రాష్ట్రానికి చెడ్డపేరు వస్తున్నదని రాజ్యవర్ధన్ దుయ్యబట్టారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో రాజకీయ యాత్రలు చేస్తున్న రాహుల్‌గాంధీ కాంగ్రెస్ పాలిత రాష్ట్రమైన రాజస్థాన్‌పై కూడా దృష్టి సారించాలని సూచించారు.

## నూతన విద్యావిధానంతో లీడర్లుగా ఎదిగే అవకాశం

**-భారత్ విశ్వగురుగా మారే అవకాశం: గవర్నర్**

హైదరాబాద్,అక్టోబర్10(ఆర్ఎన్ఎ): జాతీయ నూతన విద్యా పాలసీ-2020తో ప్రపంచానికి నాణ్యమైన విద్య నందించే కేంద్రం భారత దేశం నిలుస్తుందని గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ అన్నారు. నూతన విద్యావిధానంతో విద్యార్థులు ఉద్యోగాల కోసం ఎదురు చూసే వారుగా కాకుండా ఉద్యోగాల్ని సృష్టించే వారుగా మారే అవకాశం ఉందని అన్నారు. నూతన విధానంతో భారత్ విశ్వగురుగా మారనుందన్నారు. నాణ్యమైన విద్యతో ప్రపంచ పౌరుగా మారే అవకాశం ఉందన్నారు. ప్రపంచ విజ్ఞాన ఖనిగా సూపర్‌పవర్‌గా భారత్‌ను రూపొందించేందుకు అన్నివర్గాల వారు కలిసి రావాలన్నారు. భారతీయ విద్యా సంస్థ ద్వారా ప్రపంచ స్థాయి విద్యనందించి వచ్చిన చెప్పారు. ప్రజలు నూతన విద్యావిధానాన్ని విజ్ఞతతో అర్థం చేసుకోవాలని సూచించారు. నూతన విద్యావిధానాన్ని అమలు పరచడంలో విజ్ఞులు, మేధావులు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రాథమిక స్థాయిలో విద్యార్థులు తమ మాతృభాషలో విద్యను అర్థం చేసుకోవాలన్నారు. జపాన్, జర్మనీ, కొరియా వంటి దేశాలు కూడా విద్యార్థులు తమ మాతృభాషల్లోనే విద్యాబోధన చేసి టెక్నాలజీలో లీడర్లుగా ఎదిగాయని అన్నారు. మాతృభాషలో విద్యనభ్యసించడం వల్ల ఎలాంటి ఇబ్బందులు ఉండవని గవర్నర్ పేర్కొన్నారు.

## అధికార నివాసంనుంచి రాజకీయ కార్యకలాపాలు

**కెటిఆర్‌పై ఐసికి కాంగ్రెస్ ఫిర్యాదు**

**ఉచిత ఎల్ఆర్ఎస్‌పై ఉత్తమ్ హామీ**

హైదరాబాద్,అక్టోబర్10(ఆర్ఎన్ఎ): మంత్రి కేటీఆర్‌పై ఎన్నికల కమిషన్‌కు కాంగ్రెస్ ఫిర్యాదు చేసింది. సీఎం కేసీఆర్ అధికార నివాసాన్ని మంత్రి కేటీఆర్ దుర్వినియోగం చేస్తున్నారని కాంగ్రెస్ ఫిర్యాదులో పేర్కొంది. ప్రగతిభవన్‌ను రాజకీయ కార్యకలాపాలకు వినియోగించడాన్ని కాంగ్రెస్ తప్పుబట్టింది. జీహెచ్ఎంసీ ఎన్నికలపై పార్టీ ఎమ్మెల్యేలతో కేటీఆర్ సమీక్ష నిర్వహించారని, వంద డివిజన్లు గెలుస్తామని రాజకీయ ప్రకటన చేశారని తెలిపారు. కేటీఆర్‌పై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఇదిలావుంటే కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఉచితంగా ఎల్ఆర్ఎస్ చేస్తామని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అమానవీయంగా వ్యవహరిస్తోందని, ఈనెల 15న దుబ్బాకలో కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్ వేస్తారని ఉత్తమ్ తెలిపారు. లే అవుట్ క్రమబద్దీకరణ (ఎల్ఆర్ఎస్)పై ప్రభుత్వం తీసుకొచ్చిన 131 జీవోను రద్దు చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. 131, 135 జీవోలు కూడా ప్రజలను దోచుకోవడానికేనని కాంగ్రెస్ నేతలు మండిపడుతున్నారు. రిజిస్ట్రేషన్ ఎల్ఆర్ఎస్‌ను లింక్ చేయడం దేశంలో ఎక్కడా లేదని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. ఇప్పటికే ప్లాటు అమ్మకం, కొనుగోలుపైన రిజిస్ట్రేషన్ రూపంలో డబ్బులు చెల్లించి ఉంటారని, ఒకసారి రిజిస్ట్రేషన్ అయిన స్థలాన్ని మళ్లీ రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించమని చెప్పడం నేరమంటున్నారు. ఇంటి విస్తీర్ణం, ఇతర వివరాలు, పొలాల్లో వేసుకున్న కొట్టాల వివరాలు, ట్రాక్టర్లు, పెట్టుబడులకు వేసుకున్న షెడ్ల వివరాలను సేకరిస్తూ.. ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

## పీయూష్ గోయల్‌కు పాశ్వాన్ మంత్రిత్వ శాఖలు

న్యూఢిల్లీ,అక్టోబర్10(ఆర్ఎన్ఎ): కేంద్ర మంత్రి రామ్ విలాస్ పాశ్వాన్ మరణం నేపథ్యంలో కేంద్ర మంత్రి పియూష్ గోయల్‌కు వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ అదనపు బాధ్యతలు అప్పగించారు. దివంగత కేంద్ర మంత్రికి గోయల్ శుక్రవారం నివాళులు అర్పించారు.

రాంవిలాస్ పాశ్వాన్ హఠాన్మరణంతో కేంద్రమంత్రి వర్గంలో మార్పులు చేశారు. పాశ్వాన్ మంత్రిగా ఉన్న వినియోగ వ్యవహారాలు, ఆహారం, ప్రజా సరఫరా మంత్రిత్వశాఖ బాధ్యతలు రైల్వేశాఖ మంత్రి పీయూష్ గోయల్‌కు అప్పగించారు. ప్రధాని నరేంద్రమోదీ సలహా మేరకు గోయల్‌కు అదనపు బాధ్యతలిస్తూ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఉత్తర్వులు జారీ చేసినట్లు రాష్ట్రపతి భవన్ శుక్రవారం వెల్లడించింది. అటు.. బీహార్ ఎన్నికల సమయంలో పాశ్వాన్ మృతిచెందడం ఆ పార్టీ వర్గాలను శోకసంద్రంలో ముంచింది.

## చీరల పంపిణీలో పాల్గొన్న మంత్రులు

జగిత్యాల,అక్టోబర్9(ఆర్ఎన్ఎ): జగిత్యాల జిల్లాలో బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని మంత్రులు కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్ లాంఛనంగా ప్రారంభించారు. స్థానిక పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మహిళలకు మంత్రులు బతుకమ్మ చీరలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కొప్పుల మాట్లాడుతూ..పేదింటి ఆడపడుచులు కూడా బతుకమ్మ పండుగను సంబరంగా జరుపుకునేందుకు సీఎం కేసీఆర్ చీరల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమంలో జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత, సంజయ్ కుమార్, విద్యాసాగర్ రావు, మున్సిపాలిటీ చైర్ పర్సన్ బోగ శ్రావణి, జిల్లా కలెక్టర్ రవి పాల్గొన్నారు.

## అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యం పట్టివేత

నారాయణపేట,అక్టోబర్10(ఆర్ఎన్ఎ): రేషన్ బియ్యంతో అక్రమ వ్యాపారం చేస్తే జైలు పాలు కావడం ఖాయమని పౌరసరఫరాలశాఖ ఎన్ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ హెచ్చరించారు. నారాయణపేట జిల్లా మద్దూర్‌లో అక్రమ రేషన్ బియ్యం భాగోతం బయట పెట్టారు. సాధారణ దుకాణం లా సాదాసీదా గా కనిపించినా.. లోపలికి వెళ్తే గుట్ట గుట్టగా ఉన్న రేషన్ బియ్యం అక్రమ నిల్వను పట్టుకున్నారు. రేషన్ బియ్యం అక్రమ మార్గంలో పౌరసరఫరాలశాఖ నారాయణ పేట జిల్లా అధికారులు చెక్ పెట్టారు. అనుమానాస్పద స్థావరాలపై సివిల్ సప్లయ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్, డీసీఎస్ఓ శివప్రసాద్ రెడ్డి ,చంద్రశేఖర్ తనిఖీలు నిర్వహించారు. రెండు స్థావరాల్లో ఉన్న, దాదాపు సుమారు 600 సంచుల రేషన్ బియ్యంను అక్రమ నిల్వలను స్వాధీనం పరుచుకున్నారు. ఆయా స్థావరాల్లో ఉన్న రేషన్ బియ్యంతో సంబంధం ఉందని భావిస్తున్న ఇద్దరు వ్యక్తులను మద్దూర్ పోలీసులకు అప్పగించారు.

## పేదలకు చీరల పంపిణీ ఎక్కడా లేదు: ఎర్రబెల్లి

మహబూబాబాద్,అక్టోబర్10(ఆర్ఎన్ఎ): ప్రభుత్వమే ప్రజలకు బట్టలు పంపిణీ చేసే కార్యక్రమం దేశంలో ఎక్కడా లేదని పంచాయితీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. బతుకమ్మ చీరల పంపిణీతో ప్రభుత్వం పేదలకు అండగా నిలిచిందన్నారు. జిల్లాలోని తొర్రూరు పట్టణంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. పాలకుర్తి నియోజకవర్గ పరిధిలోని తొర్రూరు, పెద్దవంగర మండలాల మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేసి మాట్లాడారు. తెలంగాణ వచ్చిన తర్వాత ప్రభుత్వమే పండుగలను నిర్వహిస్తున్నదని పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమాలు రెండూ ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వీపీ గౌతం, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## నామినేషన్ల సందర్భంగా పోలీసుల బందోబస్తు

**-నిబంధనల మేరకు వ్యక్తులకు అనుమతి**

సిద్దిపేట,అక్టోబర్10(ఆర్ఎన్ఎ): దుబ్బాక అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల నామినేషన్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరక్కుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. నామినేషన్లు వేసేందుకు పరిమిత సంఖ్యలోనే అనుమతి ఇస్తున్నారు.

పటిష్టమైన పోలీసు బందోబస్తును నిర్వహిస్తున్నామని పోలీస్ అధికారులు అన్నారు. శుక్రవారం నుంచి దుబ్బాక అసెంబ్లీ ఉప ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. దుబ్బాక తహసీల్ కార్యాలయం పక్కన దుబ్బాక ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్ దాఖలు ప్రక్రియ కొనసాగుతుందని అన్నారు. ఆయా పోలింగ్ స్టేషన్లలో ఉప ఎన్నికలు జరుగుతున్న సందర్భంగా, కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనలను ప్రజాప్రతినిధులందరూ తూచా తప్పకుండా పాటించాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ కోవిడ్-19 నిబంధనలను పాటిస్తూ ఎన్నికల, పోలీసు సిబ్బందికి సహకరించాలని కోరారు. దుబ్బాక ఉప ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని తెలిపారు. రిటర్నింగ్ కార్యాలయం వద్ద బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. నామినేషన్ ప్రక్రియ ప్రారంభం కావటంతో ఇందుకు సంబంధించిన బందోబస్తు, తదితర వాటిపై రిటర్నింగ్ అధికారి చెన్నయ్యతో సీపీ జోయల్ డేవిస్ చర్చించారు.

# దుబ్బాక ముఖం చూడని వారికి ఓటేయవద్దు

### అభివృద్ధి చేస్తున్న టీఆర్ఎస్‌నే ఆశీర్వదించాలి ప్రచారంలో పద్మాదేవందర్ రెడ్డి పిలుపు

సిద్దిపేట,అక్టోబర్10(ఆర్ఎన్ఎ): సీఎం కేసీఆర్ రైతుల ఆర్థిక అభివృద్ధి కోసం కృషి చేస్తుంటే, మరోపక్క కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం బోరుబావుల వద్ద మీటర్లు పెడుతుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. దుబ్బాక ప్రచారంలో ఈ విషయమై బిజెపి నేతలను నిలదీయాలని అన్నారు. రైతులకు ఉచితంగా కరెంట్ ఇస్తున్న ఘనత సిఎం కెసిఆర్‌దని అన్నారు. దుబ్బాకని అన్ని విధానాల దివంతగ రామలింగారెడ్డి అభివృద్ధి చేశారని, అది కొనసాగాలంటే దుబ్బాక టీఆర్ఎస్ అభ్యర్థి సోలిపేట సుజాతను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఆమె ప్రచారంలో పాల్గొన్నారు. ప్రజలు మాయమాటలు నమ్మొద్దన్నారు. కెసిఆర్ మాత్రమే అభివృద్ధి చేయగలరని అన్నారు. పేదలకు కాంగ్రెస్, బీజేపీ చేసింది ఏమీ లేదని మాయమాటలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని అన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు గడప గడపకూ చేరాయన్నారు. ముఖ్యంగా పింఛన్లు, కేసీఆర్‌కిట్, కల్యాణలక్ష్మి, రైతుబంధు, రైతు బీమా, రైతులకు ఉచిత విద్యుత్, కాల్వాల ద్వారా సాగునీరందిచడంతో పాటు మరెన్నో పథకాలు ప్రజల మన్ననలు పొందాయన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత టీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. బతుకమ్మ చీరల పంపిణీతో ఆడపడచులు ఆనందంగా ఉన్నారని అన్నారు. పేదల సంక్షేమాన్ని పట్టించుకోని, దుబ్బాక ముఖం కూడా చూడని ప్రతిపక్షాల నాయకులు ప్రజలను మోసం చేసేందుకు ముందుకు వస్తున్నారని, ఓట్ల కోసం వస్తే వారిని ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు. టీఆర్ఎస్ పార్టీని ఆధరించి ప్రజలు కారుగుర్తుకు ఓటు వేయాలని ఆమె కోరారు. రామలింగారెడ్డి ప్రస్తుతం మన మధ్యలో లేకపోవడంతో ఆయన ఆశయాలను కొనసాగించేందుకు సీఎం కేసీఆర్ సుజాతకు అవకాశం ఇచ్చాడని ప్రజలందరూ ఆశీర్వదించి ఉప ఎన్నికల్లో గెలిపించాలని ప్రజలను కోరారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం లింగన్న ఆశయాలను కొనసాగిస్తామని తెలిపారు. నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా రామలింగారెడ్డి అందరికీ అందుబాటులో ఉండి దుబ్బాక నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశారని, నేను కూడా ఆయనలా సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు సహకారంతో దుబ్బాక ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తానన్నారు.



# ఇంతకుమించిన వెసలుబాటు ఇక కదురదు

### మారిటోరియంపై సుప్రీంకు వివరించిన ఆర్‌బిఐ

న్యూఢిల్లీ,అక్టోబర్10(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ మహమ్మారి కాలంలో రుణ గ్రహీతలకు కల్పించిన రుణ మారటోరియం పరిధిని ఇక మీదట పొడిగించడం సాధ్యం కాదని కేంద్రం తేల్చి చెప్పింది. రుణ మారటోరియం కేసుకు సంబంధించి సుప్రీంకోర్టులో దాఖలు చేసిన అఫిడవిట్‌లో కేంద్రం, ఆర్‌బీఐ పేర్కొంది. ఆరు నెలలకు మించి ఉపశమనం ఇవ్వడం సాధ్యం కాదని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తాజా అఫిడవిట్‌లో స్పష్టం చేసింది. దెబ్బతిన్న ఆయా రంగాలకు మరింత ఆర్థిక ఉపశమాన్ని అందించలేదని వెల్లడించింది. మారటోరియం కాలంలో 2 కోట్ల రూపాయల వరకు రుణాలపై 'వడ్డీపై వడ్డీని' వదులుకోవడం పై ప్రభుత్వం గతంలో ఇచ్చిన అఫిడవిట్ సంతృప్తికరంగా లేదని, క్రెడాయ్ లాంటి సంఘాల వాదనలను పరిశీలించాలని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించిన నేపథ్యంలో కేంద్రం ఈ క్లారిటీ ఇచ్చింది. నిర్దిష్ట సెక్టార్ ఆధారిత ఆర్థిక ఉపశమన వివరాల్లోకి కోర్టు వెళ్లకూడదంటూ తాజా అఫిడవిట్‌లో ఆర్‌బీఐ, ప్రభుత్వం పేర్కొన్నాయి. మారటోరియం వ్యవధి ఆరునెలలకు మించితే మొత్తం చెల్లింపుల తీరు, ప్రక్రియపై ప్రభావం చూపుతుందని ఆర్‌బీఐ తెలిపింది. ఈ చర్య రుణ గ్రహీతలపై ఒత్తిడిని పెంచుతుందని కూడా వాదించింది. వడ్డీ మీద మాఫీ చేయడమే కాకుండా, మరే ఇతర ఊరట కల్పించినా దేశ ఆర్థిక వ్యవస్థకు, బ్యాంకింగ్ రంగానికి తీరని నష్టం వాటిల్లుతుందని ప్రభుత్వం వెల్లడించింది. కోవిడ్-19 కి ముందు రియల్ ఎస్టేట్, విద్యుత్ రంగాలు సంక్షోభంలో పడ్డాయని తెలిపింది. ఈ నేపథ్యంలోఈ రంగ కష్టాలను బ్యాంకింగ్ నిబంధనల ద్వారా పరిష్కరించలేమని తెలిపింది. రియల్ ఎస్టేట్, విద్యుత్ రంగాల ఆందోళనలను పరిగణనలోకి తీసుకోవాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల మేరకు ఈ వివరణ ఇచ్చాయి. కాగా ఆరు నెలల రుణ తాత్కాలిక నిషేధ కాలంలో వడ్డీపై వడ్డీ మాఫీకి కేంద్రం అంగీకారం తెలిపిన నేపథ్యంలో అదనపు అఫిడవిట్లు దాఖలు చేయడానికి ఆర్బీఐకి, కేంద్రానికి అక్టోబర్ 5న ఒక వారం సమయం ఇచ్చింది. రియల్ ఎస్టేట్ అసోసియేషన్లు క్రెడాయ్, విద్యుత్ ఉత్పత్తిదారులు లేవనెత్తిన సమస్యలను కూడా పరిశీలించాలంటూ తదుపరి విచారణ ఈ నెల 13వ తేదీకి వాయిదా వేసిన సంగతి తెలిసిందే.

# వ్యవసాయ బిల్లులతో కెసిఆర్‌కు నిద్రపట్టడం లేదు

### ప్రజల పక్షాన పోరాడే వ్యక్తిగా గెలిపించండి: రఘునందన్ రావు

సిద్దిపేట,అక్టోబర్10(ఆర్ఎన్ఎ): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వ్యవసాయ బిల్లుతో రైతులకు లాభం చేకూరుతుందని భారతీయ జనతా పార్టీ దుబ్బాక అభ్యర్థి రఘునందన్ రావు అన్నారు. కాంగ్రెస్, టిఆర్ఎస్‌లు రైతులను మభ్య పెడుతున్నాయని మండిపడ్డారు. దుబ్బాకలో తనను గెలిపిస్తే ప్రజల గొంతుకగా నిలుస్తానని అన్నారు. ప్రజల పక్షాన మాట్లాడేందుకు తనను అసెంబ్లీకి పంపాలని ఆయన ప్రజలను కోరారు. తెలంగాణలో ధరణి పేరిట ఆస్తుల ఆన్‌లైన్ అంటూ ప్రారంభించిన నమోదు ప్రక్రియ ఎంత అస్తవ్యస్తంగా కొనసాగుతోందో ప్రచార మాధ్యమాలు కళ్ళకు కట్టినట్టు వెల్లడిస్తున్నాయన్నారు. సాంకేతిక సమస్యలు ఒకవైపు.... శిక్షణలేని సిబ్బందితో మరోవైపు.... చివరికి వేదన మాత్రం ప్రజలకు మిగిలిందన్నారు. ఇప్పటికిప్పుడు పన్నులు కడితేనే ఆస్తుల్ని ఆన్‌లైన్ చేస్తామనే హెచ్చరికలు ఎంతవరకు సబబని అన్నారు. కరోనాతో పేదలు తిండికే కష్టపడుతుంటే ఎల్ఆర్ఎస్ పేరుతో దోపిడీకి తెరతీసారని అన్నారు. ఎంతో కొంత ముట్టజెపితేగాని నమోదు చేసుకోమనే బెదిరింపులతో ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజల్ని ఆందోళనకు గురిచేస్తున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయన్నారు. డబుల్ బెడ్రూం ఇళ్ళ పేరిట ప్రజల్ని మభ్య పెడుతూనే ఉన్నారు. ప్రయివేట్ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల వెతలు... రైతుల ఆవేదనకు అంతులేదు. ప్రశాంతంగా లేని పరిస్థితులు నేడు తెలంగాణలో నెలకొన్నాయన్నారు. కేసీఆర్ పరిపాలనను అటకెక్కించి టీఆరెస్ గెలుపు కోసం పూర్తిగా దుబ్బాక ఉపఎన్నిక పైనే దృష్టిపెట్టినట్టు కనిపిస్తోందన్నారు.

రానున్న రోజుల్లో రైతేరాజు అనేలా వ్యవసాయ రంగాన్ని తీర్చిదిద్దేందుకు ప్రధాని మోదీ చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన వ్యవసాయ చట్టాలతో సీఎం కేసీఆర్ అక్రమ ఆదాయానికి కోత పడుతుందనే గుడ్డిగా వ్యతిరేకిస్తున్నారని దుయ్యబట్టారు. రైతు సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నూతన వ్యవసాయ చట్టాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు. ఈ చట్టం ద్వారా రైతులు తాము పండించిన పంటలను స్వేచ్ఛగా అమ్ముకునే హక్కు ఉంటుందన్నారు. ముఖ్యంగా కార్పొరేట్ రంగానికి చెందిన దిగ్గజాలు సైతం రైతు పొలాల వద్దనే వచ్చి పంటలు కొనుగోలు చేసే పరిస్థితి వస్తుందని తెలిపారు. దుబ్బాకలో అవినీతితో గెలవాలని చూస్తున్న టీఆర్ఎస్‌ను తిరస్కరించాలన్నారు.

# ఎస్సీ ఎస్టీలు సామాజికంగా ఆర్థికంగా అభివృద్ధి చెందలి..!

**-జిల్లా కలెక్టర్ హనుమంతరావు.**

సంగారెడ్డి, అక్టోబర్ 10 (నేటినిజం ప్రతినిధి): షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఎస్సీ స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్/కేటాయింపు, వివిధ శాఖల ద్వారా అమలు తీరుపై శాసనసభ్యులు క్రాంతి కిరణ్, మాణిక్యరావు లతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్సీ ఎస్టీ కాంపోనెంట్ కింద విడుదలైన నిధులు, ఇతర నిధులలో ఎస్సీ ఎస్టీలకు ఎంత శాతం నిధులను ఖర్చు చేస్తున్నది, ఆయా సంక్షేమ పథకాలలో లబ్ధి పొందిన ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులు ఎంతమంది, లక్ష్యం ఎంత, సాధించిన వివరాలను ఆయా శాఖల అధికారులు మానిటరింగ్ కమిటీకి వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ కాంపోనెంట్ కింద ప్రత్యేకంగా కేటాయించిన నిధులను పూర్తిస్థాయిలో ఎస్సీ ఎస్టీల కొరకు ఖర్చు చేయాలన్నారు. ప్రతి శాఖలో ఇతర బడ్జెట్ కేటాయింపులలో కూడా ఎస్సీ లకు 15 శాతం ,ఎస్ టి లకు 6.6 శాతం నిధులను ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు. నిబంధనలను ఆయా శాఖలు విధిగా పాటించాలన్నారు. శాసనసభ్యులు క్రాంతి కిరణ్ మాట్లాడుతూ అన్ని సంక్షేమ పథకాలలో ఎస్సీ ఎస్టీ లకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఎస్సీ ఎస్టీ యువతకు స్వయం ఉపాధి పథకాలను వినియోగించుకునేలా ప్రోత్సహించాలని, అందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కల్పించాలని పరిశ్రమల శాఖ జీఎంకి సూచించారు. ఆయా పథకాల లో ఎస్ సి ఎస్ టి లకు లబ్ది చేకూరేలా దృష్టి సారించాలని క్రాంతి కిరణ్ అధికారులకు సూచించారు. అనంతరం ఎస్సీ కులమునకు చెందిన ప్రశాంత్ కుమార్, బి సి కులానికి చెందిన పి. శ్రావణి కులాంతర వివాహం చేసుకున్న జంటకు రూపాయలు 2.50 లక్షల ఎఫ్ .డీ .ని కలెక్టర్ శాసనసభ్యుల చేతుల మీదుగా అందజేశారు. ఈ సమావేశంలో ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి మల్లేశం, షెడ్యూల్ తెగల అభివృద్ధి శాఖ అధికారి మన్నెమ్మ, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## దుర్గమ్మను దర్శించుకున్న మోహన్ భగవత్

విజయవాడ,అక్టోబర్10(ఆర్ఎన్ఎ): రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ విజయవాడ కనకదుర్గమ్మను శనివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఈవో, అధికారులు ఘన స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం అనంతరం తీర్ధ ప్రసాదాలను అందజేశారు. వేద పండితులు వేద ఆశీర్వచనం పొందారు. భగవత్‌కు ఆలయ అధికారులు పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయనకు దుర్గ గుడిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనుల వివరాలను అధికారులు వివరించారు. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం నూతక్కి గ్రామంలోని విజ్ఞాన విహార్ పాఠశాలలో శనివారం నుంచి మూడు రోజులు జరుగనున్న ఆర్ఎస్ఎస్ రాష్ట్ర పదాధికారుల సమావేశాల్లో మోహన్ భగవత్ పాల్గొంటున్నారు. ఆయన మూడురోజులపాటు ఈ సమావేశాల్లో పాల్గొంటారు. భగవత్ రాకతో మంగళగిరి రూరల్ పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

## కరోనా టెస్టులను నిరాకరించిన హత్రాస్ బాధిత కుటుంబ సభ్యులు

లక్నో,అక్టోబర్10(ఆర్ఎన్ఎ): హత్రాస్ హత్యాచార బాధిత కుటుంబ సభ్యులు కరోనా టెస్టులకు ససేమిరా అన్నారు. వైద్యులు వచ్చి టెస్టులు చేయించుకోవాలని సూచించగా వారు నిరకారించారు. ఉత్తరప్రదేశ్‌లోని హాత్రాస్‌లో ఓ దళిత యువతిపై లైంగిక దాడికి పాల్పడడంతో ఆమె చికిత్స పొందుతూ మరణించిన విషయం విదితమే. ఈ ఘటన దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అయితే హాత్రాస్ బాధితురాలి కుటుంబ సభ్యులకు కరోనా లక్షణాలు ఉన్నాయని తెలియడంతో డాక్టర్ల బృందం అక్కడికి వెళ్లింది. బాధితురాలి కుటుంబ సభ్యులకు స్వల్పంగా జ్వరం, దగ్గు ఉంది. ఈ నేపథ్యంలో టెస్టులు చేయించుకోవాలని వారికి వైద్యులు సూచించారు. కానీ టెస్టులకు కుటుంబ సభ్యులు నిరాకరించారని సమాచారం. గత వారం రోజుల నుంచి బాధితురాలి కుటుంబాన్ని పరామర్శించేందుకు పెద్ద ఎత్తున ఆయా రాజకీయ పార్టీల నాయకులు వెళ్లిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో జర్నలిస్టులు కూడా భారీ సంఖ్యలోనే వెళ్లారు. పోలీసులు కూడా భారీగా మోహరించారు. ఈ క్రమంలోనే బాధితురాలి కుటుంబ సభ్యులకు కరోనా సోకి ఉండొచ్చని వైద్యులు భావిస్తున్నారు.

## ఢిల్లీ ఆస్పత్రిలో కొనసాగుతున్న ఆందోళనలు

న్యూఢిల్లీ,అక్టోబర్10(ఆర్ఎన్ఎ): ఆస్పత్రి యాజమాన్యం గత కొన్ని నెలలుగా జీతాలు చెల్లించడం లేదంటూ ఢిల్లీలోని హిందూరావ్ ఆస్పత్రి వైద్యులు చేపట్టిన ఆందోళన ఇంకా కొనసాగుతూనే ఉన్నది. గత మూడు రోజులుగా ఆందోళన చేస్తున్నా జీతాల విషయమై యాజమాన్యం నుంచి స్పష్టమైన హామీ ఏది రాకపోవడంతో ఆందోళన కొనసాగిస్తున్నారు. కరోనా మహమ్మారిపై యుద్ధంలో ముందుండి పోరాడుతున్న వైద్యుల విషయంలో వ్యవహరించే తీరు ఇదేనా అని వారు ప్రశ్నిస్తున్నారు. తాము జీతాల గురించి అడిగితే మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఢిల్లీ (ఎంసీడీ) ఢిల్ ప్రభుత్వం మీద, ఢిల్లీ ప్రభుత్వం ఎంసీడీ మీద నిందలు వేస్తూ కాలయాపన చేస్తున్నారని వైద్యులు ఆరోపించారు. ఎంసీడీ, ఢిల్లీ ప్రభుత్వం మధ్య రాజకీయ ఫుట్‌బాల్ క్రీడలో తాము ఇబ్బందులు పడుతున్నామని ఆందోళనకారులు చెబుతున్నారు.

## నిరుద్యోగులు, ఉద్యోగులు ఇద్దరూ కష్టాల్లోనే

**వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బరిలోకి దిగుతున్నా: కోదండరామ్**

వరంగల్,అక్టోబర్10(ఆర్ఎన్ఎ): ప్రభుత్వ విధానాలతో నిరుద్యోగులు, ఉద్యోగులు కష్టాల్లో పడ్డారని తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొ. కోదండరామ్ అన్నారు. నిరుద్యోగులు పెనం మీద ఉంటే ఉద్యోగులు పొయ్యిలో ఉన్నారని మండిపడ్డారు. ఉద్యోగులు పని భారంతో, వెట్టి కార్మికులుగా పనిచేస్తున్నారని చెప్పారు. ఉద్యోగులకు ఇచ్చిన ఏ హామీని కేసీఆర్ నెరవేరచ్చలేదని పేర్కొన్నారు. ప్రజలకు భరోసా ఇచ్చేందుకే పట్టభద్రుల ఎన్నికల్లో మద్దతు కోరుతున్నామని తెలిపారు. తెలంగాణ సమస్యలపై పూర్తి అవగాహనతో ఉన్నాం కాబట్టి కొట్లాడగలుగుతున్నామని చెప్పారు. కాంగ్రెస్, వామపక్ష పార్టీల మద్దతు కూడగడతామన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వారి మద్దతుతో ముందుకు సాగుతామని అన్నారు. నిరుద్యోగులు కూడా తమ ఆకాంక్షను ఓటు ద్వారా వెల్లడించాలని శనివారం నాడిక్కడ అన్నారు. ఇదిలావుంటే ఉద్యోగులకు పీఆర్‌సీ, ఐఆర్, డీఏ న్యాయమైన హక్కులు అని, రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా వెంటనే వీటిని చెల్లించాలని టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్ డిమాండ్ చేశారు. టీఎన్జీవో నూతన అధ్యక్షుడిగా ఎన్నికయ్యాక ముఖ్యనాయకులతో కలిసి యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజల అనంతరం విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సాధించడంలో చూపిన చొరవను, ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో కూడా చూపిస్తామన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి టీఎన్జీవో కృషి చేస్తుందన్నారు. ఆలయ ఉద్యోగులకు ఆదాయంతో ప్రమేయం లేకుండా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేవారు. ఆయన వెంట టీఎన్జీవో మాజీ అధ్యక్షుడు కారెం రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాయకంటి ప్రతాప్, నాయకులు మందడి ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కరోనా జాగ్రత్తలు నిరంతరంగా పాటించాల్సిందే

**ఎయిమ్స్‌లో సేవలను పరిశీలించిన కిషన్ రెడ్డి**

**అభివృద్ధికి పాటుపడతామని హామీ**

యాదాద్రి-భువనగిరి,అక్టోబర్10(ఆర్ఎన్ఎ): కరోనా నియంత్రనకు వ్యాక్సిన్ వచ్చే వరకు జాగ్రత్తుల పాటించాల్సిందేనని కేంద్రం హోంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ప్రతి ఒక్కరూ భౌతిక దూరం పాటిస్తూ, మాస్కులు ధరించాలన్నారు. రద్దీ ప్రాంతాల్లో వెల్లకపోవడం మంచిదన్నారు. అలాగే చేతులను పరిశుభ్రంగా కడుగుతూ శానిటైజర్ రాసుకోవాలన్నారు. జీవితంలో ఇవన్నీ నిత్యకృత్యం కావాలన్నారు. యాదాద్రి పర్యటనలో భాగంగా కిషన్‌రెడ్డి శనివారం ఉదయం బీబీ నగర్ ఎయిమ్స్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ మాస్కులు ధరించి, భౌతిక దూరం పాటించాలని సూచించారు. బీజేపీ నాయకులు సైతం మాస్కులు ధరించాలని ఆదేశించారు. కరోనా పట్ల అప్రమత్తంగా ఉండాలని... వచ్చేది పండుగల సీజన్ ఉన్నందున ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఎయిమ్స్‌కు రాష్ట్ర ప్రభుత్వం అందుస్తున్న సేవల పరిశీలించేందుకు వచ్చానని చెప్పారు. అనంతరం ఎయిమ్స్‌ను సందర్శించిన కేంద్రమంత్రి ఎయిమ్స్‌కు కావాల్సిన సౌకర్యాలు, ఆస్పత్రి పనుల పురోగతిపై అధికారులతో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇప్పటి వరకు పూర్తయిన భవన నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అలాగే రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన ఎయిమ్స్ అధికారిక వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిమ్స్‌లో లోటుపాట్లను తెలుసుకునేందుకు సందర్శించినట్లు పేర్కొన్నారు. అందరికీ మెరుగైన వైద్యం అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మోదీ సర్కారు అధికారంలోకి వచ్చాక దేశవ్యాప్తంగా తొమ్మిది ఎయిమ్స్‌లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎయిమ్స్ నిర్మాణానికి స్థలం కేటాయింపై కేంద్రమంత్రి సంతోషం వ్యక్తం చేశారు. అధికారికంగా రాష్ట్ర ప్రభుత్వం భవనాన్ని ఎయిమ్స్‌కు బదలాయించాలని కోరారు. ఎయిమ్స్ నిర్మాణం, ఉద్యోగ, మౌలిక సదుపాయాల కల్పన ప్రారంభమైందని, భవిష్యత్ మరింత తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు. వైద్య కళాశాల పూర్తయితే 750 మంది విద్యనభ్యసిస్తారని తెలిపారు. నెల రోజుల్లో ఓపీ బ్లాక్‌ను పునః ప్రారంభిస్తామని, ఆయుష్ కేంద్రా సైతం ఏర్పాటు చేస్తామని వివరించారు. వైద్య కళాశాల ప్రాంగణంలో బ్యాంక్, పోస్టాఫీస్ సైతం అందుబాటులో ఉంచుతామన్నారు.

## మారుపాకలో కరోనా క్యాంపు విజయవంతం

**-205 మందికి కొవిడ్ పరీక్షలు**



రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 10 (నేటినిజం ప్రతినిధి): వేములవాడ మండలం మారుపాక గ్రామం లో శనివారం ఏర్పాటు చేసిన కరోనా క్యాంపు విజయవంతమైంది, మారుపాక లో శనివారం కరోనా క్యాంపు ఏర్పాటు చేశారు, ఈ సందర్భంగా వైద్యాధికారి రేగులపాటి మహేష్ రావు ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది గ్రామంలో 205 మందికి కొవిడ్ 19 పరీక్షలు నిర్వహించారు. ఇందులో ఒక్కరికి పాజిటివ్ గా, 204 మందికి నెగటివ్ గా రిపోర్ట్ వచ్చింది, .ఈ క్యాంపు ను వేములవాడ అర్బన్ ఎంపీపీ బూర వజ్రమ్మ బాబు సర్పంచ్ చెన్నమనేని స్వయంప్రభ సందర్శించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరోనా సోకకుండా ప్రతి ఒక్కరూ భౌతిక దూరాన్ని పాటించాలని అన్నారు .బయటికి వెళ్ళేటప్పుడు మాస్కులు ధరించలఅని అన్నారు . కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ జయప్రకాశ్ నారాయణ , ఫార్మసిస్ట్ మహమ్మద్ గౌస్ ,ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు ., గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు ..

# బాలికల భారతంలో భద్రత కరువు

**(11 అక్టోబర్ 'అంతర్జాతీయ బాలికల దినం' సందర్భంగా)**

బాలికంటే భారం. ఆడ పిల్లంటే అత్తారింటి ఆదదే. బాలికంటే నలిపి పారేసే మల్లెపువ్వు, బాలికంటే బలుపన్నోడి ఆట బొమ్మ. భారతంలో బాలికంటే నాకి చెత్తబుట్టలో విసిరేసే విస్తరాకు. నిర్భయలు, ఉన్నావ్‌లు, హత్రాస్‌లు, దిశలు, అనుక్షణం శీలాన్ని అరచేతిలో పెట్టుకొని భయపడుతూ బతికే సున్నిత అభాగ్య అబలలు. అమ్మాయంటే ఆట పట్టించే వస్తువు. యువతి అంటే క్రూరులకు అలుసు. ప్రపంచవ్యాప్తంగా 18 ఏళ్ళలోపు వయసున్న బాలికలు 1.1 బిలియన్ల ఉన్నారు. విశ్వవ్యాప్తంగా బాలికల పలు సమస్యలు, భద్రత, సాధికారత, లింగ వివక్ష, విద్య వంటి అంశాలను చర్చించడంతో పాటు ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కెనడా మహిళ 'రోనా అంబ్రోస్' చొరవతో ఐక్యరాజ్యసమితి 2012 నుండి ప్రతియేటా 11 అక్టోబర్‌న "అంతర్జాతీయ బాలికల దినం (ఇంటర్నేషనల్ డే ఆఫ్ గర్ల్ చైల్డ్)" నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. బాలికలను విద్యకు దూరం చేయడం, అమ్మాయిల్ని వంటింటికి పరిమితం చేయడం, బాల్యవివాహాలు, పోషకాహారలోపం, హక్కుల్ని కాలరాయడం, కుటుంబంలో నిర్ణయాధికారం లేకుండా ద్వితీయ శ్రేణి పౌరురాలిగా పక్కనబెట్టడం, వివక్ష నుండి రక్షించడం, లైంగిక హింసలు, మానభంగాలు, బాలికల్ని కార్మికులుగా మార్చడం, వైద్యసదుపాయాల లేమి లాంటి పలు సమస్యలు అనాదిగా వస్తున్నాయి. విశ్వవ్యాప్తంగా 62 మిలియన్ల బాలికలు నిరక్షరాస్యులతో సతమతమవుతూ, వంటింటికి మరియు తమ వృత్తులకే పరిమితం అవుతున్నారు. బాలికల్లో 25 శాతం బలవంతంగా బాల్యవివాహాలు చేసుకుంటున్నారు.

అంతర్జాతీయ బాలికల దినం-2020 సందర్భంగా "మై వాయిస్, అవర్ ఈక్వల్ ఫ్యూచర్"ను నినాదం తీసుకున్నారు. కౌమారదశలో ఉన్న అమ్మాయిలను లింగ వివక్ష లేని సాధారణ జనజీవన ప్రవంతిలోకి ఆకర్షించడానికి ప్రభుత్వాలు పలు చట్టాలను అమలు చేస్తున్నాయి. బాలికలకు విద్య, ఉద్యోగం, ఆరోగ్య సదుపాయాలు, గౌరవప్రద జీవితం, ఆర్థిక స్వేచ్ఛ, నిర్ణయాధికారంలో భాగస్వామ్యం, లైంగిక వేధింపుల కట్టడి, అత్యాచారం చేసిన వారికి కఠిన దండన, హక్కుల కల్పన, ఆస్తి హక్కు, నాయకత్వ అవకాశాల కల్పన, గృహ హింస లేకుండా చూడడం, నైపుణ్యాభివృద్ధి, మహిళా భద్రత, బాల్యవివాహాల రద్దు, అన్ని రంగాల్లో సమాన అవకాశాల కల్పన లాంటి సంక్షేమకర చర్యలు తీసుకుంటున్నారు. మహిళంటే అమ్మ, ఆలి, అక్క, చెల్లి, కూతురు, బాధ్యతగల పౌరురాలు, నాయకురాలు, మార్గదర్శి, ఔత్సాహికురాలు, ఉద్యోగిని, ఆర్థిక ఆధారం వంటి పాత్ర నిర్వహిస్తున్న బహుముఖ ప్రజ్ఞాశాలి. మహిళా సాధికారతతోనే దేశ సమగ్రాభివృద్ధి సాధ్యపడుతుంది. 2021 వరకు ప్రపంచంలో 435 మిలియన్ల మహిళలు దినసరి కనీస ఆదాయం పొందలేని దుస్థితిలో ఉంటారని అంచనా. దీనికి తోడుగా కోవిడ్-19 కల్లోలంతో 47 మిలియన్ల అమ్మాయిలు పేదరికంలోకి నెట్టబడుతున్నారు. ప్రపంచ స్థాయిలో ప్రతి ముగ్గురిలో ఒక మహిళ లైగింక, గృహ లేదా భౌతిక హింసలను అనుభవిస్తున్నది. ఇప్పటికీ 60 శాతం ప్రపంచ దేశాల్లో లింగ వివక్ష అనాదిగా ఆచారంగా పాటించబడుతోంది.

భారతదేశంలో 2020 అంచనాల ప్రకారం 108 పురుషులకు 100 మహిళలు ఉన్నారు (1000 :924). ఇండియా జనాభాలో 51.96 శాతం పురుషులు మరియు 48.04 శాతం మహిళలు ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగా పురుషులు 50.4 శాతం మరియు స్త్రీలు 49.6 శాతం ఉన్నారు. అమ్మాయిల సంఖ్య తగ్గడానికి కారణాలుగా గర్భంలో అమ్మాయి ఉందని తెలిసి భ్రూణహత్యలకు పాల్పడడం, ఆరోగ్య సదుపాయాల లేమి, బాల్యవివాహాలతో కౌమారదశలోనే గర్భం దాల్చడం, ప్రసూతి ఆసుపత్రులు సమీపంలో లేకపోవడం, అవిద్యతో అవగాహనాలేమి లాంటివి చెప్పవచ్చు. భ్రూణహత్యల్లో 90 శాతం గర్భస్థ శిశువు ఆడపిల్ల కారణమని తేలింది. దీనిని గమనించిన ప్రభుత్వాలు లింగనిర్ధారణ పరీక్షలను నిషేధించింది. మన దేశంలో 10 ఏళ్ళు దాటిన బాలికలకు నేటికీ బాల్యవివాహాలు, బాలికల్ని పనిలో పెట్టుకోవడం, ఫీమేల్ జనిటల్ మ్యుటిలేషన్ లాంటి దురాచారాలకు గురి అవుతున్నారు. పేద కుటుంబాలలో 80 శాతం బాలికలు ప్రాథమిక విద్యకు కూడా దూరం అవుతున్నారు. ప్రపంచ బాల్యవివాహాలలో 33 శాతం ఇండియాలో జరుగుతున్నాయని అంచనా. భారత మహిళల్లో 75 శాతం ఏదో ఒక గృహ హింసకు గురి అవుతున్నారు. గ్రామీణ బాలికలు వ్యవసాయ కూలీలు, బీడీ కార్మికురాళ్ళు, బాల్య వివాహాలు, వంట పనులు, ఇటుక బట్టీల్లో మరియు అసంఘటిత రంగాల్లో తమ బాల్యాన్ని కోల్పోతున్నారు. భ్రూణహత్యల నిరోధానికి 'కిషోరి శక్తి యోజన', ప్రసూతి వైద్య సదుపాయాల కల్పనకు 'సమృద్ధి యోజన' మరియు వైద్య సదుపాయాల కల్పనకు 'ఆయుష్మతి యోజన' పథకాలను అమలు చేస్తున్నారు.

అమ్మాయిలకు అబ్బాయిలతో సమానంగా విద్య, వైద్య, ఉద్యోగ ఉపాధి, లింగ సమానత్వం, వృత్తి నైపుణ్య వికాసం, పోషకాహారం, బాల్యవివాహాలు మరియు బాలకార్మిక వ్యవస్థ నిషేదించడం, సదుపాయాల కల్పన, విద్యాలయాల్లో టాయిలెట్ల ఏర్పాటు, ఆస్థి హక్కు కల్పన, ఆచారాల పేరుతో అమ్మాయిల అణచివేత, ప్రసూతి ఆసుపత్రుల అందుబాటు, లింగ ఆధారిత అత్యాచారాల కట్టడి, పరిసరాల పరిశుభ్రత లాంటి చర్యలను తీసుకోవాలి. అదే జరిగితే అమ్మాయిలు భూమి, ఆకాశం మరియు సముద్ర జలాల్లో తమ సత్తా చాటుకునే అవకాశాలన్నింటిని తీసుకొని, అబ్బాయిలతో సమానంగా, కొన్నిసార్లు ఉత్తమంగా తమ విధులను నిర్వహిస్తున్నారు. ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక రంగాల్లో యువతుల్ని ప్రోత్సహించాల్సిన సమయం ఆసన్నమైంది. 2015లో "బేటీ బచావో, బేటీ పడావో" పథకంతో కేంద్ర ప్రభుత్వ బాలికల అభ్యున్నతికి కృషి చేస్తున్నది. ఆడ పిల్లల్ని రక్షించుకోవడం, ఉన్నత విద్య అందించడం, భ్రూణహత్యలను నిరోధించడం, మహిళలపై అత్యాచారాలను కట్టడి చేయడం లాంటి చర్యలతో లింగ వివక్ష సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. అమ్మాయిల మానసిక, సాంఘీక, భౌతిక, ఆర్థిక సమస్యలను అధిగమించడానికి తగు చర్యలు తీసుకోవాలి. యువతులపై ఆసిడ్ దాడులు, భ్రూణహత్యలు, అత్యాచారాలు, మానభంగాలు, భౌతిక గృహ హింస, కిడ్నాపులు లాంటివి జరుగకుండా కఠిన చర్యలు తీసుకోవడం ప్రభుత్వాల కనీస బాధ్యత. చదువులో సరస్వతి, సంపదలో లక్ష్మి, ధైర్యంలో దుర్గమాతలు మనకు ఆదర్శ మహిళలని నమ్మిన సంస్కృతిగల హిందుస్థాన్‌లో యువతుల పట్ల వివక్ష జాతికే సిగ్గు చేటు. మహిళలో అమ్మను, చెల్లిని చూద్దాం. అమ్మాయిలను మహాశక్తి రూపాలుగా పూజిద్దాం. అమ్మాయిని ఆది దేవతగా ఆరాదిద్దాం.



డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# యువకులే టీఆర్ఎస్ సైనికులు

**వారికి స్వయం ఉపాధితో అండగా నిలిచాం**
**పార్టీలో చేరిన పలువురికి కండువా కప్పిన హరీష్ రావు**

సిద్ధిపేట,అక్టోబర్10(ఆర్ఎన్ఎ): యువకులే టీఆర్ఎస్ పార్టీ సైనికులు అని ఆర్థిక మంత్రి హరీష్ రావు అన్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే టీఆర్ఎస్‌కు శ్రీరామ రక్షగా మారాయి. అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు కేవలం మూడేండ్లలో చేసి చూపించిన ఘనత సీఎం కేసీఆర్‌ది, టీఆర్ఎస్ పార్టీదేనని హరీశ్‌రావు స్పష్టం చేశారు. దుబ్బాకలో కాంగ్రెస్, బీజేపీలు ఖాళీ అయ్యాయని, ఆ పార్టీల్లో ఉన్న నాయకులంతా టీఆర్ఎస్‌లో చేరుతున్నారని అన్నారు. ఇక మిగిలింది ఆ పార్టీల్లో కేవలం క్యాండిడేట్లు మాత్రమే... వాళ్లు కూడా ఎన్నికలు అయిపోగానే పత్తా లేకుండా పోతారన్నారు. జాతీయ పార్టీ అని చెప్పుకుంటున్న ఆ పార్టీలకు క్యాడర్ లేకుండాపోయింది. దుబ్బాక ఉప ఎన్నికల ప్రచారానికి ఎక్కడెక్కడి నుంచో నాయకులు వస్తున్నారు. దుబ్బాకకు ఎమ్మెల్యేగా తొలిసారిగా ఓ మహిళకు అవకాశం కల్పిస్తే, కాంగ్రెస్, బీజేపీ నాయకులు జీర్ణించుకోలేపోతున్నాయన్నారు. దుబ్బాక నియోజకవర్గం ఉప ఎన్నిక నేపథ్యంలో ఆనాజ్‌పూర్, తిమ్మక్కపల్లి గ్రామాలకు చెందిన బీజేపీ యువకులు హరీష్ రావు సమక్షంలో టీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా యువకులందరికీ గులాబీ కండువాలు కప్పి హరీష్‌రావు పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ.. విశ్వసనీయత కలిగిన పార్టీకి, ప్రభుత్వానికి మద్దతు తెలపడంలో యువత ముందుంటారని.. అలాంటి వారు టీఆరెస్ పార్టీలో చేరడం శుభపరిణామం అని అన్నారు. యువతను ఆకర్షించేలా బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు మాయమాటలు చెబుతున్న విషయాన్ని గ్రహించి పని చేసే పార్టీ వైపు వచ్చిన వారందరికీ తగిన గుర్తింపు ఇస్తామన్నారు. కళ్ళ ముందు కనిపించని నాయకులకు దుబ్బాక నియోజకవర్గంలో ఓట్లు అడిగే హక్కు లేదన్నారు. యువతకు ఏ అవసరం వచ్చినా ఈ ప్రాంతంలో నేను, రామలింగన్న అండగా నిలబడ్డామని గుర్తు చేశారు. ప్రభుత్వ ఉద్యోగాలు రావడానికి సొంత ఖర్చులతో కోచింగ్ సెంటర్లు పెట్టి ఎంతో మంది కుటుంబాల్లో వెలుగులు నింపామని చెప్పారు. జాబ్ మేళాలు నిర్వహించి ప్రయివేట్ ఉద్యోగాలను వారి కళ్ళ ముందుకే తెచ్చామన్నారు. వారికి ఉపాధి కల్పించడం కోసం ఈ ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని హరీష్ రావు గారు వివరించారు. ఇవన్నీ జరిగిన వాస్తవాలే తప్ప కాంగ్రెస్, బీజేపీలు చెప్పే కళ్ళబొల్లి మాటలు కాదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక, రాయ్‌పోల్ మండలం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ ఆక్రమణలను సహించం

**ధరణిలో అన్ని వివరాలు పొందుపరుస్తాం**
**ఆక్రమణదారులకు మంత్రి సత్యవతి హెచ్చరిక**
**బురదరోడ్డును పూడ్చి ఆదర్శంగా నిలిచిన ఎమ్మెల్యే**

మహబూబాబాద్,అక్టోబర్10(ఆర్ఎన్ఎ): ప్రభుత్వ భూముల ఆక్రమణలపై గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ మండిపడ్డారు. ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే సహించేది లేదని ఆమె తేల్చిచెప్పారు. మహబూబాబాద్ పట్టణంలో సఖీ కేంద్రం శంకుస్థాపన కార్యక్రమాన్ని కొందరు అడ్డుకోవడంపై మంత్రి సత్యవతి ఆగ్రహం వ్యక్తం చేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రాన్ని అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ క్రమంలో ఇక్కడ అనేక ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించాల్సి ఉంది. కానీ కొందరు కావాలని ప్రభుత్వ భూములను ఆక్రమించి రాజకీయం చేయాలనుకుంటున్నారు. అలాంటి వారిని వదిలే ప్రసక్తే లేదని ఆమె హెచ్చరించారు. మహబూబాబాద్‌లో సుమారు 5వేల ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని రికార్డులు, లెక్కలు చెబుతున్నాయి. ప్రభుత్వ భూముల్లో ఇప్పటి వరకున్న అర్హులను రెగ్యులరైజ్ చేస్తాం. ప్రతి ఇంచు భూమిని సర్వే చేస్తాం, సరిహద్దులు నిర్ణయిస్తాం. ప్రభుత్వ భూముల్లో కట్టుకున్న పేదవాళ్ల జోలికి వెళ్లము, కానీ ప్రయోగాలు చేసే భూమిని స్వాధీనం చేసుకుంటాం అని మంత్రి స్పష్టం చేశారు. ఇదిలావుంటేరణఇలో వివరాలన్నీ పక్కాగా నమోదు చేస్తామని అన్నారు. ఆక్రమణలను సహించబోమని అన్నారు. అలాగే పేదల భూములకు రక్షణగా ఉంటామని అన్నారు. ఇదిలావుంటే మహబూబాబాద్ మండలంలోని మాల్యాల గ్రామంలో బతుకమ్మ చీరలను పంపిణీ చేసేందుకు టీఆర్ఎస్ ఎమ్మెల్యే శంకర్ నాయక్.. బేథోల్ మీదుగా వెళ్తున్నారు. అయితే అక్కడ రోడ్డు బురదమయం కావడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఎమ్మెల్యే గ్రహించారు. దీంతో తక్షణమే రెండు టిప్పర్ల డస్ట్‌ను తెప్పించి అక్కడ మరమ్మతులు చేపట్టారు. ఎమ్మెల్యేనే స్వయంగా పార చేతపట్టి పనిలో నిమగ్నమయ్యారు. గుంతలను పూడ్చారు. రోడ్డు మరమ్మతు పనులు చేపట్టినందుకు ఎమ్మెల్యేకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

# 10 వార్డులో కౌన్సిలర్ రామ్ చంద్రం ఆధ్వర్యంలో బతుకమ్మ చీరలు పంపిణీ



రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 10 (నేటినిజం ప్రతినిధి):తెలంగాణ రాష్ట్రం ద్వారా వచ్చిన బతుకమ్మ చీరల ను వేములవాడ పట్టణంలో 10 వార్డులో అవార్డు కౌన్సిలర్ సిరిగిరి రామ్ చంద్రం పంపిణీ చేశారు .ఈ సందర్భంగా మాట్లాడుతూ ముందస్తు మహిళ సోదరిమణులకి బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు . తెలుగింటి ఆడపడుచులు ఆనందోత్సాహాలతో సద్దుల బతుకమ్మ వేడుకలు జరుపుకోవాలని కోరారు గత పాలకులు బతుకమ్మ పండుగ ను పట్టించుకోలేదు. కల్వకుంట్ల కవిత జాగృతి ద్వారా బతుకమ్మ ని విశ్వ వ్యాప్తంగాప్రచారం చేస్తే ముఖ్య మంత్రి కేసీఆర్ పండుగ కానుకగా బతుకమ్మ చీరలు ఇచ్చి సంబురాలు జరుపుకోవాలని పంపించారు . ఈ బతుకమ్మ చీరలు ఒక్క హిందువులకే కాదు అన్ని మతాల వారికి అందుస్తున్నారు . ఎందుకంటే తెలంగాణ సర్వ మతాలకు కులాలకు ప్రతీక. కావున ప్రతి ఒక్క ఆడబిడ్డ మన అన్న ముఖ్య మంత్రి కేసీఆర్ అండగా ఉండాలని కోరారు . ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి ,టీఆర్ఎస్ నాయకులు బొల్లం దేవరాజు ,ఆకుల రాజు, బత్తుల దేవరాజు తదితరులు పాల్గొన్నారు

# భారీ వర్షానికి ఉద్యోగి బలి

**సెల్లార్ నీటిలో పడి వ్యక్తి మృతి**

హైదరాబాద్,అక్టోబర్10(ఆర్ఎన్ఎ): నగరంలో శుక్రవారం రాత్రి కురిసిన వర్షం ఓ వ్యక్తి ప్రాణం తీసింది. భారీ వర్షానికి ముషీరాబాద్ లో ఓ వ్యక్తి చనిపోయాడు. ఎడతెరపి లేకుండా కురిసిన వర్షానికి ఓ అపార్ట్ మెంట్ లోకి భారీగా వరద నీరు చేరింది. దీంతో సెల్లార్ లో ఉన్న నీటిలో చిక్కుకుని బి. రాజ్ కుమార్ అనే వ్యక్తి చనిపోయాడు. ఈయన వయసు 54 ఏళ్లు. హైకోర్టులో పనిచేస్తున్నట్లుగా గుర్తించారు. సెకండ్ ఫ్లోర్ లో ఉన్న రాజ్ కుమార్ బయటకు వెళ్దామని కిందకి దిగగా సెల్లర్లో నీరు చూసుకోకుండా ముందుకు వెళ్లడంతో అందులో పడిపోయాడు. ప్రమాదానికి కారణం సెల్లర్‌లో ఉన్న నీళ్లలో షార్ట్ సర్క్యూట్ రావడం వల్లే జరిగిందని పోలీసులు తెలిపారు. డెడ్ బాడీని పోస్ట్ మార్టం కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించిన పోలీసులు.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేశామన్నారు.

# సుజాతను గెలిపించి లింగన్న ఆశయాలు కొనసాగించాలి

**ప్రచారంలో ఎంపి కొత్త ప్రభాకర్ రెడ్డి**

సిద్దిపేట,అక్టోబర్10(ఆర్ఎన్ఎ): దుబ్బాక ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థి సుజాతక్కకు లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపించి, జాతీయ పార్టీలకు దుబ్బాక దెబ్బ రుచిని దేశవ్యాప్తంగా తెలియజెయ్యాలని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ మోసపూరిత పార్టీ, అందులో నాయకులను, కార్యకర్తలను మోసగించడమే ఆ పార్టీ చేసే పనులని మండిపడ్డారు. మోసపూరిత కాంగ్రెస్ పార్టీని భూ స్థాపితం చేసేందుకు టీఆర్ఎస్ గూటికి అనేకులు వచ్చారన్నారు. కాంగ్రెస్‌లో కాలు గుంజే రాజకీయాలుంటాయని మండి పడ్డారు. దుబ్బాకలో కాంగ్రెస్ పార్టీ నామరూపాలు చేయటమే లక్ష్యంగా పని చేయాలన్నారు.

దశాబ్దాల పాటు అధికారంలో ఉన్న కాంగ్రెస్, బీజేపీలు ప్రజలకు ఏమి చేయలేక పోయాయని, ఆ పార్టీలకు అభివృద్ధి పట్టదని, ఆ పార్టీలకు ఓట్లు అడిగే హక్కు లేదని అన్నారు. శనివారం మిరుదొడ్డి మండల పరిధిలోని పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. సీఎం కేసీఆర్ ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న టీఆర్ఎస్ పార్టీకి ఓట్లు అడిగే హక్కు ఉందని.. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఏమి చేశాయని ప్రజలను ఓట్లు అడుతున్నాయని ప్రశించారు.

దివంగత ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి మృతిచెందడంతో అతని సతీమణి సోలిపేట సుజాతకు టిక్కెట్ ఇచ్చి నిలిపారని అన్నారు. రైతులకు సీఎం కేసీఆర్ నూతన రెవెన్యూ చట్టాన్ని తీసుకువచ్చారని తెలిపారు. తెలంగాణలో రైతులకు 24 గంటల పాటు ఉచిత కరెంటును ఇస్తున్నారని అన్నారు. ఈ ఎన్నికలో బీజేపీ, కాంగ్రెస్‌లకు ఓటుతో తగిన గుణపాఠం చెప్పాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

# ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే సహించం : మంత్రి సత్యవతి

మహబూబాబాద్, అక్టోబర్ 10 : ప?రభుత్వ భూముల ఆక్రమణలపై గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ మండిపడ్డారు. ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే సహించేది లేదని ఆమె తేల్చిచెప్పారు. మహబూబాబాద్ పట్టణంలో సఖీ కేంద్రం శంకుస్థాపన కార్యక్రమాన్ని కొందరు అడ్డుకోవడంపై మంత్రి సత్యవతి ఆగ్రహం వ్యక్తం చేశారు.

మహబూబాబాద్ జిల్లా కేంద్రాన్ని అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ క్రమంలో ఇక్కడ అనేక ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించాల్సి ఉంది. కానీ కొందరు కావాలని ప్రభుత్వ భూములను ఆక్రమించి రాజకీయం చేయాలనుకుంటు న్నారు. అలాంటి వారిని వదిలే ప్రసక్తే లేదని ఆమె హెచ్చరించారు. మహబూబాబాద్‌లో సుమారు 5వేల ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని రికార్డులు, లెక్కలు చెబుతున్నాయి. ప్రభుత్వ భూముల్లో ఇప్పటి వరకున్న అర్హులను రెగ్యులరైజ్ చేస్తాం. ప్రతి ఇంచు భూమిని సర్వే చేస్తాం, సరిహద్దులు నిర్ణయిస్తాం. ప్రభుత్వ భూముల్లో కట్టుకున్న పేదవాళ్ల జోలికి వెళ్లము, కానీ ప్రయోగాలు చేసే భూమిని స్వాధీనం చేసుకుంటాం అని మంత్రి స్పష్టం చేశారు.

# నామాను పరామర్శించిన టీఆర్ఎస్ ఎంపిలు

ఖమ్మం,అక్టోబర్10(ఆర్ఎన్ఎ): టీఆర్ఎస్ లోక్‌సభాపక్ష నేత, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వర్‌ను శనివారం పలువురు సహచర ఎంపీలు పరామర్శించారు. నామా నాగేశ్వరరావు మాతృమూర్తి నామా వరలక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఉదయం ఖమ్మం నెహ్రూనగర్‌లోని నామా నివాసానికి చేరుకున్న మెదక్ ఎంపీ కొత్తా ప్రభాకర్ రెడ్డి, జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, చేవెళ్ల ఎంపీ డా.గడ్డం రంజిత్ రెడ్డి, మహబూబ్ నగర్ ఎంపీ మన్నే శ్రీనివాస్ రెడ్డి, వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేశ్ నేత తదితరులు వరలక్ష్మి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.

# వేములవాడలో కొనసాగుతున్న ధరణిపోర్టల్ సర్వే

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 10 (నేటినిజం ప్రతినిధి):వేములవాడ మున్సిపల్ పరిధిలో ధరణి పోర్టల్ సర్వేలో భాగంగా అధికారులు ఇంటింటికి తిరిగి ప్రజల ఆస్తుల వివరాలు నమోదు చేస్తున్నారు తెలంగాణ ప్రవేశపెట్టిన ధరణి పోర్టల్ సర్వేలో భాగంగా శనివారం వేములవాడ పట్టణంలో 10వార్డులో అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి సర్వే చేస్తున్నారు స్థానిక కౌన్సిలర్ సిరిగిరి రామ్ చందర్ ,స్పెషల్ ఆఫీసర్ పర్యవేక్షణలో ఇంటింటికి వెళ్లి ప్రజలను ప్రజలను ధరణి పోర్టల్ తెలియజేస్తూ ప్రజల ఆస్తుల వివరాలను నమోదు చేశారు .ఈ సందర్భంగా కౌన్సిలర్ సిరిగిరి రామ్ చంద్రం మాట్లాడుతూ 10వార్డు ప్రజలు ఏమైనా సమస్యలు ఉంటే నా దృష్టికి తీసుకొని వస్తే అధికారులతో మాట్లాడి పరిష్కరించడానికి కృషి చేస్తానని చెప్పారు . వార్డు ప్రజలందరూ అధికారులకు సహకరించాలని కౌన్సిలర్ రామ్ చందర్ కోరారు .అలాగే పట్టణంలో సర్వే కార్యకర్తలు ఇంటింటికి తిరిగి వివరాలు అధికారులు మున్సిపల్ సిబ్బంది అంగన్వాడీ నమోదు చేస్తున్నారు



# చీర అందే... చిరునవ్వు చిందే

**మహిళల ఆత్మ గౌరవమే కేసీఆర్ ప్రభుత్వ లక్ష్యం**
**నగర మేయర్ యాదగిరి సునీల్ రావు**
**47వ డివిజన్ లో అట్టహాసంగా బతుకమ్మ చీరెల పంపిణీ**

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 10 (నేటినిజం ప్రతినిధి): తెలంగాణ ఆడ బిడ్డల పండుగ..సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతిబింబమైన బతుకమ్మ పండుగను మహిళలు ఆత్మగౌరవంతో జరుపుకోవాలనేదే సీఎం కేసీఆర్ లక్ష్యమని నగర మేయర్ యాదగిరి సునీల్ రావు అన్నారు. శనివారం నగరంలో మధు గార్డెన్ లో 47వ డివిజన్ కార్పొరేటర్ ×మహమ్మద్ శర్ఫుద్దీన్× ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ చీరెల పంపిణీ కార్యక్రమానికి మేయర్ సునీల్ రావు, ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ లు హాజరై మహిళలకు చీరెలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా మేయర్ సునీల్ మాట్లాడుతూ పేదల సంక్షేమానికి టీఆర్ఎస్ ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తుందని అన్నారు. పండుగ పూట మహిళలకు ఆత్మగౌరవం దక్కడంతో పాటు చేనేత కార్మికులకు ఉపాధి లభించిందన్నారు. అభివృద్ధి, సంక్షేమం లో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. గత ప్రభుత్వాల కంటే మెరుగ్గా మహిళల అభ్యున్నతికి టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాధాన్యత కల్పించిందని గుర్తు చేశారు. కోవిడ్-19 నిబంధనలకు అనుగుణంగా పండుగలు జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్, మెప్మా సిబ్బంది, డివిజన్ పెద్దలు పాల్గొన్నారు.



# ప్రభుత్వమే పండగలను నిర్వహించడం అరుదు

**-బతుకమ్మ చీరల పంపిణీలో మంత్రి ఎర్రబెల్లి**

వరంగల్,అక్టోబర్10(ఆర్ఎన్ఎ): తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అన్నిమతాలకు చెందిన పండగలను ప్రజల పండగల్లా ప్రభుత్వమే నిర్వహిస్తోందని పంచాయితీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. వ్యవసాయం వంటి అన్ని రంగాల అభివృద్ధి, సంక్షేమ పథకాలతో తెలంగాణనే సీఎం కేసీఆర్ పండగ చేసిందని అన్నారు. వరంగల్ రూరల్‌జిల్లా పాలకుర్తి నియోజక వర్గంలోని రాయపర్తిలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈసందర్బంగా మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ రంజాన్, క్రిస్మస్, బతుకమ్మ పండగ ఏదైనా కానీ ప్రభుత్వమే ప్రజలకు బట్టలు పెట్టి పండుగలని చేయడం చరిత్రలో ఎక్కడా లేదన్నారు. సీఎం కేసీఆర్ 2017లో బతుకమ్మను పండగని రాష్ట్ర పండగగా ప్రకటించారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న 18 ఏళ్లు పైబడిన ప్రతి మహిళకు చీరల పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు ప్రతి ఏడాది రాష్ట్రంలో 1 కోటీ 2లక్షల మంది మహిళలకు చీరలు అందిస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో 20లక్షల 36వేల 234 కుటుంబాలకు ఈ చీరలు అందుతున్నాయని తెలిపారు. గత ఏడాది 313కోట్లు ఖర్చు చేస్తే ఏడాది 317 కోట్లు ఖర్చు చేస్తున్నట్టు తెలిపారు. గత ఏడాది 110 రకాల రంగుల డిజైన్‌లు అందిస్తే ఈసారి 287 రకాల చీరలు అందిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు, మహిళలు పాల్గొన్నారు. మరోవైపు పాలకుర్తి నియోజకవర్గంలో పీఎంజీఎస్‌వై రోడ్ల నిర్మాణ పనులకు మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు శనివారం మధ్యాహ్నం శంకుస్థాపన చేశారు. మొత్తం రూ. 38 కోట్ల 49లక్షల విలువైన మూడు రోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు. గూడూరు పీడబ్ల్యూ రోడ్డు నుంచి ధర్మాపురం వరకు రూ.14 కోట్ల 97లక్షల విలువైన డబుల్ రోడ్డు, ఈరవెన్ను పీడబ్ల్యూ రోడ్డు నుంచి కంచనపల్లి వరకు రోడ్డు విస్తరణకు రూ.10 కోట్ల 43లక్షల విలువైన రోడ్డు, పాలకుర్తి పీడబ్ల్యూ రోడ్డు నుంచి కొడకండ్ల వరకు రూ.13 కోట్ల 9లక్షల విలువైన డబుల్ రోడ్డును నిర్మించనున్నారు.



వరంగల్ రూరల్ జిల్లా రాయపర్తిలో మహిళలకు బతుకమ్మ చీరలను పపిణీ చేసిన మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

# ఎమ్మెల్సీ ఓటు నమోదు వేగవంతం చేయాలి

**-పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే రేగా అవగాహన**

భద్రాద్రి కొత్తగూడెం,అక్టోబర్10(ఆర్ఎన్ఎ): ఖమ్మం - వరంగల్ - నల్లగొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో గ్రాడ్యుయేట్స్ అందరూ ఓటు నమోదు చేసుకోవాలని పినపాక టీఆర్ఎస్ ఎమ్మెల్యే రేగా కాంతారావు విజ్ఞప్తి చేశాం

ఎ. మణుగూరు మండలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు నమోదు కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి, పార్టీ ముఖ్యులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేగా కాంతారావు మాట్లాడుతూ.. ఓటరు నమోదు కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలి అని పార్టీ ముఖ్యులకు సూచించారు. వీలైనంత వరకు గ్రామాల్లో పర్యటించి పట్టభద్రులను గుర్తించి ఓటు నమోదు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. 2017 సంవత్సరానికి ముందు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవడానికి అర్హులు అవుతారని వివరించారు. గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కోసం సమర్పించే దరఖాస్తులలో సమాచారం పూర్తి స్థాయిలో ఉండే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పినపాక నియోజకవర్గ జడ్పీటీసీలు, ఎంపీపీలు ,వైస్ ఎంపీపీ లు, సొసైటీ చైర్మన్ లు, టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షులు, సర్పంచులు, ఎంపీటీసీలు, సింగరేణి టీబీజీకేఎస్ నాయకులు, పార్టీ ముఖ్య నాయకులు ప్రైవేటు విద్యా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.